RNI NO:TELTEL/2022/81794

# వాస్తవ తెలంగాణ
VASTHAVA TELANGANA DAILY
నిజం మా నైజం

PUBLISHED FROM: TELANGANA & ANDHRAPRADESH

www.vasthavatelangana.com

ఎడిటర్ : చింతల రామకృష్ణ  సంపుటి : 13  సంచిక : 34  శుక్రవారం, మే 16, 2025,  పేజీలు - 8  వెల : 3/-




## అక్కడ చేసినట్టు ఇక్కడ చేస్తే లోపల వేయిస్తా

## అధికారికి సీఎం వార్నింగ్

**హైదరాబాద్ :**హైదరాబాద్ లోని జలసౌధ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. అధికారులతో ప్రాజెక్టులపై సమీక్ష నిర్వహించారు. ఈ క్రమంలోనే మహబూబ్‌నగర్ సీఈ రమణారెడ్డిపై తీవ్ర అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకానికి సంబంధించిన భూ సేకరణ, పునరావాస సమస్యలు పూర్తవగానే పంపుహౌస్‌ల నిర్మాణం మొదలవుతు ందని సీఎం వ్యాఖ్యానించారు. ఆ తర్వాతే పైపుల బిల్లులు వేయాలని సూచించారు. ఇంతకుముందు రమణారెడ్డి కాళేశ్వరం ప్రాజెక్టులో ఎస్‌ఈగా పనిచేశారు. ఆ విషయాన్ని గుర్తుచేస్తూ.. అక్కడ చేసినట్లు ఇక్కడ చేస్తే, చర్యలు తప్పవని.. కేసు పెట్టి లోపల వేయిస్తానని సీఎం హెచ్చరించారు.
అంతే కాకుండా కాళేశ్వరం బ్యారేజీ విషయంలో.. విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కేసులు ఉన్న వారిపై తప్పకుండా చర్యలు



ఉంటాయని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. కేసులకు సంబంధం లేని వారు భయపడాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. ప్రాజెక్టుల నిర్మాణం విషయంలో ఒకటికి రెండుసార్లు తప్పులు లేకుండా సరి చూసుకోవాలన్నారు. గతంలో పొరపాట్లు చేసిన వారిపై విజిలెన్స్ కేసులవుతున్నాయన్న విషయాన్ని గుర్తు చేసుకుంటూ జాగ్రత్తగా పని చేయాలంటూ ఆదేశాలు జారీ చేశారు. ఇక కాంట్రాక్టు ఉద్యోగుల వేతనాల గురించి అధికారులు సీఎం దృష్టికి తీసుకువచ్చారు. అవసరం ఉన్నంత వరకే కాంట్రాక్టు సిబ్బందిని తీసుకోవాలని సూచించారు. అందువలన ప్రభుత్వం ఒక కమిటీ వేసిందని ప్రతిపాదనలు వచ్చాక పరిశీలిస్తామని స్పష్టం చేశారు. ప్రాజెక్టుల ఓ అండ్ ఎం పెండింగ్ బిల్లులకు నెలకు రూ. 50 కోట్లు, నిర్వహణకు రూ. 75 కోట్ల వరకు కేటాయింపులు చేస్తామని సీఎం హామీ ఇచ్చినట్టు అధికారులు చెబుతున్నారు. మరోవైపు నేడు ఇరిగేషన్ శాఖలో కొత్తగా నియమితులైన ఉద్యోగులకు నియామక పత్రాలను సీఎం స్వయంగా అందజేశారు.

## తెలంగాణ ఆడబిడ్డల ఆత్మాభిమానాన్ని తాకట్టుపెట్టారు

: కాంగ్రెస్ ప్రభుత్వంపై కిషన్ రెడ్డి ఆగ్రహం..



**హైదరాబాద్ :**తెలంగాణ ఆడపడుచులతో విదేశీ వనితల కాళ్లు కడిగించారంటూ కేంద్ర మంత్రి, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు కిషన్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంపై మండి పడ్డారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని, మన ఆడబిడ్డల ఆత్మాభిమానాన్ని తాకట్టుపెట్టారంటూ ఆగ్ర హం వ్యక్తంచేశారు. మిస్ వరల్డ్ పోటీదా రులు బుధవారం రామప్ప ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మిస్ వరల్డ్ పోటీదారుల పాదాలను.. కొందరు మహిళలతో కడిగించడం పట్ల కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. తెలంగాణ ఆత్మాభిమానాన్ని తాకట్టుపెట్టేట్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరించడం సిగ్గుచేటని.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం అహంకారానికి ఇది నిదర్శనం అంటూ కిషన్ రెడ్డి ఫైర్ అయ్యారు. రాణి రుద్రమదేవి ఏలిన గడ్డపై, చారిత్రక రామప్ప ఆలయ ప్రాంగణంలో తెలంగాణ మహిళలను అవమానించడం దురదృష్టకరమని.. కిషన్ రెడ్డి పేర్కొన్నారు. సమ్మక్క, సారలమ్మ పుట్టిన గడ్డపై మహిళలకు అత్యంత తీవ్రమైన అవమానం జరిగిందని.. ఇది కాంగ్రెస్ పార్టీ సంస్కృతి అంటూ కిషన్ రెడ్డి అన్నారు.

## ఆ రెండు ప్రాంతాల్లో మిస్ వరల్డ్ పోటీదారుల పర్యటన..



**యాదాద్రి:** మిస్ వరల్డ్ పోటీదారులు రెండు ప్రాంతాల్లో పర్యటించనున్నారు. టూరిజం విలేజ్ పోచంపల్లికి మిస్ వరల్డ్ పోటీదారులు రానున్నారు. పోచంపల్లి సందర్శనకు ఆఫ్రికా ఖండానికి చెందిన 25 దేశాల ప్రతినిధులు వెళ్లనున్నారు. ఇవాళ (మే15) సాయంత్రం 6 గంటల నుంచి పోచంపల్లిలో పలు కార్యక్రమాల్లో అందాల భామలు పాల్గొననున్నారు. ఇక్కత్ పట్టుచీరల నేయడంలో పోచంపల్లి ప్రపంచ ఖ్యాతి పొందింది. నేతన్నలతో మాట్లాడి, చీరలు నేసే విధానం గురించి పోటీదారులు తెలుసుకోనున్నారు. పోచంపల్లి వీధుల్లో పర్యటన, మ్యూజియాన్ని అందాల భామలు సందర్శించనున్నారు. అనంతరం స్థానికులతో వారు మాట్లాడనున్నారు. భూదాన్ పోచంపల్లి ప్రస్థానం, హ్యాండ్లూమ్‌పై ప్రత్యేక వీడియోను ప్రదర్శించనున్నారు. అలాగే యాదగిరిగుట్ట ఆలయానికి మరో మిస్ వరల్డ్ కాంటెస్టెంట్ల బృందం వెళ్లనున్నారు. ఆలయానికి సాయంత్రం 5 గంటలకు వారు చేరుకుంటారు. ఈ బృందంలో 10 మంది సభ్యులు ఉన్నారు. సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల వరకు స్వామి వారి ఆలయాన్ని పోటీదారులు సందర్శించనున్నారు.

## రాహుల్‌పై చర్యలకు రంగం సిద్ధం..

**పాట్నా, మే 15:** తమ ఆదేశాలను ధిక్కరించిన నేపథ్యంలో లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ పార్టీ ఎంపీ రాహుల్ గాంధీపై న్యాయపరంగా చర్యలు తీసుకుంటామని దర్భంగా జిల్లా ఉన్నతాధికారులు వెల్లడించారు. గురువారం దర్భంగాలో జిల్లా ఉన్నతాధికారులు విలేకర్లతో మాట్లాడుతూ.. దర్భంగాలో అంబేద్కర్ హాస్టల్ వద్ద విద్యార్థులతో ముఖాముఖీ కార్యక్రమానికి నిర్వహించేందుకు కాంగ్రెస్ పార్టీ ఎంపీ రాహుల్ గాంధీకి అనుమతి ఇవ్వలేదని తెలిపారు. స్థానిక టౌన్ హాల్ వద్ద ఈ కార్యక్రమం నిర్వహించేందుకు నిర్వాహకులకు అనుమతి ఇచ్చామని స్పష్టం చేశారు. కానీ రాహుల్ గాంధీ మాత్రం అంబేద్కర్ హాస్టల్ వద్దే విద్యార్థులతో ముఖాముఖీ కార్యక్రమం నిర్వహించేందుకు సిద్ధమయ్యారని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని అడ్డుకొనేందుక పోలీసు సిబ్బంది చేసిన ప్రయత్నాలు ఫలించలేదన్నారు. ఆ క్రమంలో అంబేద్కర్ హాస్టల్ వద్దకు రాహుల్ గాంధీ వస్తున్న క్రమంలో ఆయన్ని యూనివర్సిటీ గేట్ వద్ద పోలీసులు ఆపే ప్రయత్నం చేశారన్నారు. పోలీసుల ప్రయత్నాన్ని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తీవ్రంగా వ్యతిరేకించాయని



చెప్పారు. దీంతో యూనివర్సిటీ గేట్ తెరవక తప్పలేదన్నారు. అనంతరం ఖాన్‌కా చౌక్ వద్దకు రాహుల్ చేరుకుని.. అక్కడి నుంచి అంబేద్కర్ హాస్టల్ వద్ద ఏర్పాటు చేసిన వేదిక వద్దకు కాలినడకన ఆయన చేరుకున్నారని తెలిపారు. ఆ తర్వాత రాహుల్ గాంధీ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారని చెప్పారు. మీతో మాట్లాడటానికి, మీరు చెప్పింది వినేందుకు తాను ఢిల్లీ నుంచి వచ్చానని విద్యార్థులకు రాహుల్ గాంధీ వివరించారు. కానీ అధికారులు తానను ఆపేందుకు అడుగడుగునా అడ్డం పడ్డారన్నారు. అలాగే బ్యారికేడ్స్‌ను రహదారులకు అడ్డంగా పెట్టారని చెప్పారు. కానీ తాను మరో మార్గం ద్వారా ఇక్కడికి చేరుకున్నారన్నారు. అంతేకాదు.. తనను ఎవరు ఆపలేరన్నారు. ఎందుకంటే తన వెనుక మీ బలం ఉందని చెప్పారు. దీంతో ప్రపంచంలో ఏ శక్తి తనను ఆపలేదని తెలిపారు. అలాగే బిహార్‌లోని నితీష్ కుమార్ ప్రభుత్వంతోపాటు ప్రధాని మోదీలపై ఈ సందర్భంగా రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు గుప్పించారు. అదే విధంగా కులగణన నిర్వహించేందుకు పార్లమెంట్ సాక్షిగా ఒప్పుకోని ప్రధాని మోదీ.. తన ఒత్తిడి కారణంగా ఈ గణనను నిర్వహించేందుకు సానుకూలంగా స్పందించారని రాహుల్ గాంధీ ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రధాని మోదీ ప్రభుత్వం.. ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగానికి, కులగణనతోపాటు నిరుపేదలకు వ్యతిరేకంగా పని చేస్తుందని మండిపడ్డారు. ఈ మోదీ ప్రభుత్వం కేవలం అదానీ, అంబానీ సంస్థలకు అనుగుణంగా మాత్రమే పని చేస్తుందంటూ రాహుల్ గాంధీ ఆరోపించారు.

## దేశంలోనే అతిపెద్ద రూ.22వేల కోట్ల విద్యుత్ ప్రాజెక్ట్..

## ఏపీలో ఆ జిల్లా పంట పండుతుంది

**అమరావతి :**కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వరుసగా అనేక పెద్ద పెద్ద ప్రాజెక్టులు వస్తున్నాయి .తాజాగా అనంతపురం జిల్లాలో భారీ విద్యుత్ ప్రాజెక్టు రాబోతుందని ఏపీ ప్రభుత్వం చెప్పడం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పురోగతిని స్పష్టం చేస్తుంది. గుత్తి మండలం బేతపల్లి లో 22 వేల కోట్ల రూపాయలతో రెన్యూ విక్రమ్ శక్తి ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఈ భారీ విద్యుత్ ప్రాజెక్టును ఏర్పాటు చేయబోతుంది. ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ ద్వారా ప్రోత్సాహకాలుఇది భారతదేశంలోనే అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ పునరుత్పాదక విద్యుత్ కాంప్లెక్స్ అవుతుందని ఏపీ ప్రభుత్వం వెల్లడించింది. రేపు మంత్రి లోకేష్ ఈ భారీ విద్యుత్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయనున్నారు. ఈ భారీ విద్యుత్ ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ ద్వారా అనేక ప్రోత్సాహకాలను ఇచ్చి ప్రభుత్వం అండగా నిలవనుంది. గతంలో దావోస్ లో జరిగిన



వరల్డ్ ఎకనామిక్ ఫోరం లో మంత్రి లోకేష్ రెన్యూ చైర్మన్ సుమంత్ సిన్హా మధ్య జరిగిన చర్చల నేపథ్యంలో, ఇంటిగ్రేటెడ్ పునరుత్పాదక విద్యుత్ కాంప్లెక్స్ ను ఏర్పాటు చేయడానికి మార్గం సుగమమైంది. దాదాపు ఆరు సంవత్సరాల తరువాత ఈ సంస్థ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి రెడీ అయింది. భారీ విద్యుత్ ప్రాజెక్ట్ ప్లాన్ ఇలాఈ భారీ విద్యుత్ ప్రాజెక్టులో భాగంగా మొదటి 587 మెగావాట్ల సౌర విద్యుత్, అలాగే 250 మెగావాట్ల పవన విద్యుత్, 400 మెగావాట్ల బ్యాటరీ స్టోరేజ్ యూనిట్లను ఏర్పాటు చేసి ఆ తర్వాత వీటిని అప్గ్రేడ్ చేస్తారు. ప్రస్తుతం వీటి కోసం 7,000 కోట్ల రూపాయలు పెట్టుబడిని పెట్టాలని నిర్ణయించారు. ఉన్నతీకరణ లో భాగంగా 1800 మెగావాట్ల సౌర విద్యుత్తు, 1000 మెగావాట్ల పవన విద్యుత్, 2000 మెగావాట్ల బ్యాటరీ స్టోరేజ్ కి దీనిని పెంచుతారు. వైసీపీ ప్రభుత్వం చేసిన పనితో ఆలస్యంగా విద్యుత్ ప్రాజెక్ట్గతంలో టిడిపి ప్రభుత్వ హయాంలో రెన్యూ సంస్థ 777 మెగావాట్ల పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టుల కోసం చంద్రబాబు సర్కారుతో ఒప్పందం చేసుకుంది. కానీ వైసీపీ ప్రభుత్వం పి పి ఏ లను రద్దు చేయడంతో ఆ ప్రాజెక్టు ఏర్పాటు కాలేదు.

## కాంగ్రెస్ నేతలను హెచ్చరించిన ఎమ్మెల్సీ కవిత..

## పింక్ బుక్ పేరు చెప్తూ..



**కామారెడ్డి:** బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను బెదిరించే కాంగ్రెస్ నేతల పేర్లను పింక్ బుక్‌నమోదు చేస్తామని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. ఈనెల 27న వరంగల్ జరగనున్న బీఆర్ ఎస్ రజతోత్సవ సభకు కార్యకర్తలు రాకుండా కొంత మంది అడ్డుకుంటున్నారని కవిత మండిపడ్డారు. తమ కార్యకర్తలకు ఫోన్లు చేస్తూ బెదిరిస్తున్నారని, వారందరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. బాన్సువాడలో బీఆర్ఎస్ రజతోత్సవ సభ సన్నాహక సమావేశంలో ఎమ్మెల్సీ కవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేతలపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ..”బీఆర్ఎస్ నేతలను కాంగ్రెస్ నేతలు బెదిరిస్తున్నారు. నేను కేసీఆర్? లాగా కాదు.. నేను రౌడీ టైపు. మా నేతలను బెదిరించే అధికారులను, కాంగ్రెస్ నాయకులను వదిలిపెట్టే ప్రసక్తే లేదు. అలాంటి వారి పేర్లు పింక్ బుక్‌లో నమోదు చేస్తా. మా పోరాట ఫలితంగానే తెలంగాణ వచ్చింది. అందుకే వరంగల్ రజతోత్సవ వేడుక తెలంగాణ కుంభ మేళా అవుతుంది. ప్రజలు మళ్లీ బీఆర్ఎస్ పాలన కోరుకుంటున్నారు. బాన్సువాడలో ఉపఎన్నిక వస్తే గులాబీ జెండా ఎగరడం ఖాయం. 15 నెలల్లో ప్రజల విశ్వాసం కోల్పోయిన కాంగ్రెస్ ప్రభుత్వానికి నోబెల్ బహుమతి ఇవ్వాలి. కాంగ్రెస్ పాలన అంటేనే మాటల ప్రభుత్వం అనేది తేలిపోయింది.

## రాష్ట్రపతికే సుప్రీం పవర్..

తేల్చిచెప్పిన ద్రౌపది ముర్ము



**ఢిల్లీ :**రాష్ట్రాలు, కేంద్రం పంపించే బిల్లులను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అభ్యంతరం వ్యక్తం చేశారు. రాజ్యాంగంలో లేని గడువును సుప్రీంకోర్టు ఎలా నిర్ణయిస్తుందని ఆమె ప్రశ్నించారు. ఇటీవల గవర్నర్లు, రాష్ట్రపతి వద్ద బిల్లులు పెండింగులో ఉండిపోవడంపై సుప్రీంకోర్టు సంచలన తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. దీనిపై తాజాగా స్పందించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సర్వోన్నత న్యాయస్థానానికి పలు ప్రశ్నలు వేశారు. శాసనసభలు ఒకటికి రెండు సార్లు ఆమోదించిన బిల్లులను గవర్నర్లు ఆమోదించకుండా కాలయాపన చేయడం, రాష్ట్రపతి పరిశీలనలో ఉన్న బిల్లులు తీవ్ర జాప్యానికి గురికావడంపై సుప్రీంకోర్టులో కొద్దిరోజుల క్రితం విచారణ జరిగింది. తమిళనాడు గవర్నర్ రవి, ఆ రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య నెలకొన్న వివాదంపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు సంచలన తీర్పునిచ్చింది. గవర్నర్లు ఉద్దేశపూర్వకంగా బిల్లులు తొక్కిపెట్టడం సరికాదని భావించిన సుప్రీంకోర్టు నిర్దేశిత కాలంలో రాష్ట్ర ప్రభుత్వాలు పంపిన బిల్లులను పరిష్కరించాలని సూచిస్తూ తీర్పునిచ్చింది. అంతేకాకుండా గతంలో ఎన్నడూ లేనట్లు గవర్నర్లతోపాటు రాష్ట్రపతికి సుప్రీంకోర్టు గడువు విధించింది.

## యూటర్న్ తీసుకున్న ట్రంప్..

## భారత్-పాక్ వివాదంపై కొత్త వ్యాఖ్యలు

**అమెరికా:**భారత్, పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందానికి తానే మధ్యవర్తిత్వం వహించానని గతంలో గర్వంగా చెప్పుకున్న అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రస్తుతం యూటర్న్ తీసుకున్నారు. తాను అలా చెప్పలేదని, కానీ ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు తగ్గించడానికి మాత్రం ప్రయత్నించానని అంటున్నారు. ఈ తాజా వ్యాఖ్యలు అంతర్జాతీయంగా చర్చనీయాంశంగా మారాయి. ట్రంప్ ఎందుకు మాట మార్చారు? భారత్-పాక్ సంబంధాలపై ఆయన వ్యాఖ్యల ప్రభావం ఏమిటో వివరంగా తెలుసుకుందాం. గతంలో ట్రంప్ మాట్లాడుతూ.. “భారత్, పాక్ మధ్య యుద్ధం వస్తుందని అందరూ అనుకున్నారు. కానీ నేను జోక్యం చేసుకుని ఆ యుద్ధాన్ని ఆపాను” అని చెప్పుకొచ్చారుక అయితే, ఈ వ్యాఖ్యలను భారత్ తీవ్రంగా ఖండించింది. జమ్మూ కాశ్మీర్ అంశం ద్వైపాక్షిక సమస్య అని, మూడో దేశం జోక్యం అవసరం లేదని స్పష్టం చేసింది. అంతేకాకుండా, కాల్పుల విరమణ ఒప్పందం కూడా భారత్



కోరిక కాదని చెప్పింది. పాకిస్తాన్ కోరిక మేరకే అది జరిగిందని తెలిపింది. తాజాగా ట్రంప్ తన మాటలను మార్చారు.. ట్రంప్ మాట్లాడుతూ.. “నేను యుద్ధాన్ని ఆపాను అని చెప్పలేదు. కానీ భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు తగ్గించడానికి నా వంతు ప్రయత్నం చేశాను” అని అన్నారు. ఇరు దేశాల మధ్య సయోధ్య కుదర్చడానికి తాను కృషి చేశానని, కానీ యుద్ధాన్ని ఆపానని చెప్పలేదని ఆయన కొత్త రాగం పాడుతున్నారు. ఈ వ్యాఖ్యలపై భారత విదేశాంగ మంత్రి జైశంకర్ స్పందించారు. భారత్-పాక్ చర్చల్లో మూడో దేశం జోక్యం అవసరం లేదని, భారత్ కేవలం పీవోకే, ఉగ్రవాదం గురించే మాట్లాడుతుందని మంత్రి తెలిపారు. పాకిస్తాన్ ఉగ్రవాదులను అప్పగించాలని, ఉగ్రవాద శిబిరాలను మూసివేయాలని ఆయన హెచ్చరించారు.

సింధు జలాల నుంచి ఒక్క చుక్క నీరు కూడా పాకిస్తాన్‌కు ఇవ్వబోమని, కాల్పుల విరమణ పాకిస్తాన్ కోరుకుంటుంది తప్పా భారత్ కాదని జైశంకర్ స్పష్టం చేశారు. ట్రంప్ మాట మార్చడం వెనుక రాజకీయ కారణాలు ఉన్నాయంటూ విశ్లేషకులు భావిస్తున్నారు. భారత్‌తో సంబంధాలను దెబ్బతీయడం ఆయనకు ఇష్టం లేదని అంటున్నారు.

### వరి ధాన్యం కొనుగోలు

## ప్రభుత్వం అలసత్వం వయిస్తుంది

### ఆందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్



**చౌటకూర్//వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి కృష్ణ కాంత్:**. కొనుగోలు కేంద్రానికి రైతులు వరి ధాన్యం తీసుకొచ్చి వారాల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి దాపురించిందని ఆయాన ఆరోపించారు. గురువారం చౌటుకూరు మండల్ చెక్రియల్ గ్రామంలో దాన్యం సేకరణ కేంద్రాన్ని జెడ్ పి మాజీ చైర్మన్ జైపాల్ రెడ్డి తో కలిసి సందర్శించారు. వర్థంతో తడిసిన ధాన్యం కల్లాలు,నింపిన బస్తాలు ముద్దావ్వడంతో రైతుల పరిస్థితి దయనీయంగా మారిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వర్షం పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ ముందు హెచ్చరించినప్పటికీ అధికారులు రైతులకు తగు జాగ్రత్తలు చెప్పకపోవడం బస్తాల్లో నింపిన ధాన్యాన్ని మిల్లులకు తరలించడంలో నిర్లక్ష్యం వహించడం వల్ల కొన్ని వేల క్వింటాళ్ల వరి వర్షానికి తడిచిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని ఆయన అన్నారు. ఈ ఒక్క సెంటర్ లోనే కాదు పుల్కల్లోని అన్ని సెంటర్లలో కూడా లారీలు రాక వేల కొద్ది బస్తాలు దాన్యం సెంటర్లోనే మగ్గుతున్నాయని రేపటిలోగా వాటిని తరలించకపోతే మొలకలు వచ్చే పరిస్థితి ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారని ఆయన వివరించారు. ప్రభుత్వ అధికారుల సమన్వయ లోపం, అధికారుల దృష్టి దాన్యం సేకరణ మీద లేకపోవడం వల్లనే ఇటువంటి సమస్యలు తలెత్తుతున్నాయని రైతులు కొన్ని రోజులపాటు దాన్యం కొనుగోలు కేంద్రంలోని గడపాల్సి వస్తుందని చెప్పారు. కొనుగోలు లో ఎలాంటి అవాంతరాలు లేకుండా సవ్యంగా జరగడానికి అధికారులకు సూచనలు ఇవ్వాల్సిన మంత్రి గారు ఏం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. నియోజకవర్గం నుంచి మంత్రిగా పప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ గారు వెంటనే జోక్యం చేసుకొని దాన్యం కొనుగోలుపై రివ్యూ పెట్టుకుని దాన్యం కొనుగోలు సరైన విధంగా జరిగేటట్టు చూడాలని క్రాంతి కిరణ్ డిమాండ్ చేశారు.

## నిరుపయోగంగా మారిన చేపల మార్కెట్




**జిన్నారం,వాస్తవ తెలంగాణ న్యూస్:** సంగారెడ్డి జిల్లా జిన్నారం మండల కేంద్రంలోని చాపల మార్కెట్ మందుబాబులకు అడ్డాగా మారింది. చేపల మార్కెట్ ను గత ప్రభుత్వం 10 లక్షల రూపాయల నిధులతో నిర్మించింది. గ్రామానికి శివారులో భవనం ఉండటంతో మందుబాబులు రెచ్చిపోతున్నారు. మార్కెట్లో ఇష్టం వచ్చినట్టు బాటిల్స్ చెత్తాచెదారం వేస్తూ భవనాన్ని పాడు చేస్తున్నారు. నిరుపయోగ మారిన దానిని అందుబాటులోకి తీసుకురావాలని స్థానిక గ్రామస్తులు కోరుతున్నారు.

## టీటీడీకి రూ.1.40కోట్లు విరాళం



**తిరుమల,15 మే(వాస్తవ ఆంధ్ర)** టీటీడీలోని వివిధ ట్రస్టులకు గురువారం రూ.1.40కోట్లు విరాళంగా అందింది. అమెరికాలోని బోస్టన్ కు చెందిన ఎన్అర్ఐ దాత భాగవతుల ఆనంద్ మోహన్ ఎస్వీ ప్రాణదాన ట్రస్ట్ కు రూ.1,00,01,116, ఎస్వీ గోసంరక్షణ ట్రస్ట్ కు రూ.10,01,116, ఎస్వీ విద్యాదాన ట్రస్ట్ కు రూ.10,01,116, ఎస్వీ వేదపరిరక్షణ ట్రస్ట్ కు రూ.10,01,116, ఎస్వీ సర్వశ్రేయాస్ ట్రస్ట్ కు రూ.10,01,116 లు విరాళం అందజేశారు.

ఈ మేరకు తిరుమలలోని టీటీడీ చైర్మన్ క్యాంపు కార్యాలయంలో చైర్మన్ శ్రీ బీ.ఆర్. నాయుడుకు విరాళం డీడీలను అందజేశారు. ఈ సందర్భంగా దాతను చైర్మన్ అభినందించారు.

## కుటుంబ సభ్యులకు పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుంది : వంటేరు ప్రతాప్ రెడ్డి

### పడే మోసిన వంటేరు, పురం రవి

**మనోహరబాద్ వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి నవీన్ :** మనోహరాబాద్ మండలం పాలాట గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు వంటేరు ప్రతాప్ రెడ్డి ముఖ్య అనుచరుడు నీలం సత్యనారాయణ గౌడ్ గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందడం జరిగింది.



గురువారం రోజున వంటేరు ప్రతాప్ రెడ్డి సత్యనారాయణ గౌడ్ భౌతికయానికి పూలమాలవేసి నివాళులర్పించారు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సత్యనారాయణ గౌడ్ అంత్యక్రియలో పాల్గొని పాడే మోసిన వంటేరు ప్రతాప్ రెడ్డి. తక్షణ ఆర్థిక సహాయంగా 50 వేల రూపాయలను కుటుంబ సభ్యులకు వంటేరు ప్రతాప్ రెడ్డి అందించారు సత్యనారాయణ గౌడ్ మృతి పార్టీకి తీరని లోటు అని ఒక మంచి కార్యకర్తను మంచి నాయకున్ని బిఆర్ఎస్ పార్టీ కోల్పోయిందని అన్నారు, సత్యనారాయణ గౌడ్ లాంటి అనుచరున్నీ కోల్పోవడం చాలా బాధగా ఉందని వంటేరు ప్రతాప్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు భగవంతుడు సత్యనారాయణ గౌడ్, ఆత్మకి శాంతిని చేకూర్చాలని కోరుకున్నారు. సత్యనారాయణ గౌడ్ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు వారి వెంట మాజీ ఎంపీపీ పురం నవనీత రవి ముదిరాజ్, పొట్టోళ్ల వెంకట్ గౌడ్, శేఖర్ గౌడ్, సర్పంచులు అర్జున్, మాధవరెడ్డి, పంజా బిక్షపతి, రాజు, ఉదయ్ లు ఉన్నారు.

## శ్రీవారి భక్తులకు సాంప్రదాయ వంటకాలు అందించాలి

**- హెూటళ్లలో పరిశుభ్రత, నిర్వహణ చక్కగా ఉండాలి**
**- హెూటళ్ల నిర్వాహకులు సాంప్రదాయ వస్త్రధారణతో భక్తులకు సేవలు అందించాలి**
**- టిటిడి అదనపు ఈవో శ్రీ సిహెచ్ వెంకయ్య చౌదరి**





**తిరుమల,మే,08 (వాస్తవ ఆంధ్ర)** తిరుమల శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులకు వివిధ రాష్ట్రాలకు చెందిన సాంప్రదాయ వంటకాలను అందించాలని, ఎలాంటి అసౌకర్యం కలగకుండా హెూటళ్లలో పరిశుభ్రత, నిర్వహణ చక్కగా ఉండేలా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలని టిటిడి అదనపు ఈవో శ్రీ సిహెచ్ వెంకయ్య చౌదరి కోరారు. తిరుమలలోని ఆస్థానమండపంలో గురువారం హెూటళ్ల నిర్వాహకులు, స్థానికులతో అదనపు ఈవో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు ఈవో మాట్లాడుతూ, భక్తుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని నాణ్యమైన ఆహార పదార్థాలను భక్తిశ్రద్ధలతో అందించాలన్నారు. తిరుమల యాత్ర భక్తులకు ఒక మధురానుభూతిని కల్పించాలన్నారు. హెూటల్ నిర్వాహకులు చేసే చిన్న చిన్న పొరపాట్ల వల్ల భక్తులు చాలా అసంతృప్తితో వెళుతున్నారని చెప్పారు. హెూటళ్ల యజమానులు చట్టబద్ధమైన నియమ నిబంధనలను పాటించాలని, ఎప్పటికప్పుడు పరిసరాలను శుభ్రపరచుకోవాలన్నారు. టీటీడీ ఆరోగ్య విభాగం ప్రతిరోజు చేయవలసిన పనులతో కూడిన చెక్లిస్ట్ అందిస్తుందని, దానిని తప్పకుండా పాటించాలన్నారు. టిటిడిలోని అన్ని విభాగాల అధికారులు ఎప్పటికప్పుడు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తారని చెప్పారు. తిరుమలలో మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనంతో పాటు భక్తుల రద్దీ అధికంగా ఉండే ప్రాంతాలలో 33 అన్నప్రసాద కౌంటర్లలో టీటీడీ నాణ్యమైన భోజనం అందిస్తోందన్నారు. అదేవిధంగా భగవంతుని సన్నిధిలోని హెూటళ్ల యజమానులు కూడా మంచి తినుబండారాలు అందించాలన్నారు. భక్తుల ఆరోగ్యానికి హానికరమైన చైనీస్ వంటకాలను పూర్తిగా నిలిపివేయాలని సూచించారు. హెూటల్లో నిర్వాహకులు, పనిచేసే సిబ్బంది సాంప్రదాయ వస్త్రధారణ ధరించి భక్తులకు సేవలందించాలని, ముఖ్యంగా తెలుగు సాంప్రదాయం ఉట్టిపడాలన్నారు. గతంలో జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. హెూటల్లో వద్ద ట్రేడ్ లైసెన్స్, జిఎస్టి వంటి ధ్రువీకరణ పత్రాలను అధికారులకు కనిపించేలా డిస్ప్లే చేయాలన్నారు. భక్తులు డిజిటల్ పేమెంట్ చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. హెూటల్ నిర్వహణ లైసెన్సును నిర్ణీత సమయంలో రెన్యువల్ చేసుకోవాలన్నారు. అన్ని దుకాణాలలో ధరల పట్టికను ప్రదర్శించాలని చెప్పారు. ఆహార పదార్థాలు తయారు చేసేటప్పుడు సిలిండర్ ఏర్పాటు చేసే విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను సంబంధిత అధికారులు నడిగి తెలుసుకోవాలన్నారు. హెూటళ్ల లోని వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని, హెూటల్లో యజమానులు సమిష్టిగా పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని పిలుపునిచ్చారు. భక్తులకు సురక్షితమైన తాగునీరు అందించాలన్నారు నీరు, విద్యుత్తు వృధా కాకుండా వినియోగించుకోవాలని చెప్పారు. త్వరలో ఐదు నుండి 10 హెూటళ్లలో పైలెట్ ప్రాజెక్టు కింద ఈ విధి విధానాలు అమలు అయ్యేలా నిర్వాహకులు సహకరించాలన్నారు. ఇందుకు అవసరమైన సహాయ సహకారాలను టీటీడీ అధికారులు అందిస్తారని వివరించారు. అనంతరం హెూటళ్ల నిర్వాహకులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను అదనపు ఈవోకి వివరించారు. దీనిపై ఆయన అధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ సమావేశంలో అన్న ప్రసాదం డిప్యూటీ ఈవో శ్రీ రాజేంద్ర కుమార్, ఆరోగ్య విభాగం డిప్యూటీ ఈ వో శ్రీ సోమన్నారాయణ, ఎస్టేట్ అధికారి శ్రీ వెంకటేశ్వర్లు, అన్నప్రసాదం ప్రత్యేక అధికారి శ్రీ శాస్త్రి, విజిఓలు శ్రీమతి సదాలక్ష్మి, శ్రీ సురేంద్ర ఇతర అధికారులు, హెూటళ్ల యజమానులు పాల్గొన్నారు.

## తిరుమలలో భద్రతపై ఉన్నతస్థాయి సమీక్ష

**తిరుమల,15 మే (వాస్తవ ఆంధ్ర)** తిరుమలలోని అన్నమయ్య భవన్లో గురువారం తిరుమల భద్రతపై ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి పోలీసు శాఖ, టీటీడీ, ఇతర భద్రతా విభాగాల ఉన్నతాధికారులు హాజరయ్యారు. అనంతపురం రేంజ్ డీఐజీ డా.షెమూషి అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది.

ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ, ఇటీవల పహల్గాం ఉగ్రదాడి ఘటన నేపథ్యంలో తిరుమల ఆలయంలో భద్రతను మరింత బలోపేతం చేయడమే భద్రతా ఆడిట్ ఉద్దేశ్యం అని పేర్కొన్నారు. అన్ని భద్రతా దళాలు మరియు టీటీడీ విభాగాల సమన్వయంతో పనిచేస్తూ, భక్తుల మనోభావాలను కాపాడటమే ప్రధాన లక్ష్యంగా ఉండాలన్నారు.అంతకు ముందు టీటీడీ ఇన్ఛార్జి సీవీఎస్వో మరియు తిరుపతి అర్బన్ ఎస్పీ శ్రీ హర్షవర్ధన్ రాజు 2023 మే నెలలో నిర్వహించిన భద్రతా ఆడిట్ సమీక్షలో చేసిన ప్రతిపాదనలు, అలాగే ఇటీవల ఏర్పడిన పరిస్థితుల ఆధారంగా చేపట్టాల్సిన మార్పులు అనే విషయాలపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా సుదీర్ఘ%శీ%గా వివరించారు.



అలాగే, ఏపీఎస్పీ, డీఏఆర్, ఎస్పీఎఫ్, హెూం గార్డులు, సివిల్ పోలీసు, టీటీడీ భద్రతా సిబ్బంది వంటి అన్ని భద్రతా దళాలను సమన్వయ పరచి ప్రతి ఒక్క దళానికి స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ రూపొందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బంది సహా అన్ని యాక్సెస్ కంట్రోల్ బృందాలకు తగిన శిక్షణ ఇవ్వాల్సిన అవసరముందని అన్నారు.

తలకోన, మామండూరు, తుంబురు తీర్థం, మంగళం మార్గాలు సహా శేషాచల అటవీ ప్రాంతానికి చెందిన 14 ప్రవేశ ద్వారాలలో భద్రతను మరింత పటిష్టం చేయాలని సూచించారు.అలాగే, భద్రతా సిబ్బందికి రసాయన, జీవ, కిరణ, అణు ముప్పులపై శిక్షణ(%జదీ=చీ%), యాంటీ సాబటేజ్ చర్యలు, మాక్ డ్రిల్లులు, ఎవాక్యుయేషన్ డ్రిల్లులు వంటి అంశాలపై శిక్షణలు ఇవ్వాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ సమావేశంలో గ్రేహౌండ్స్ (కమాండర్) ఎస్పీ డా. గరుడ్ సుమిత్ సునీల్, ఐఎస్డబ్ల్యూ ఎస్పీ శ్రీ అరిఫ్ హాఫీజ్, తిరుపతి డీఎఫ్ఓ శ్రీ వివేక్ ఆనంద్, వివిధ భద్రతా దళ అధికారులు, టీటీడీ విజిలెన్స్, ఇతర శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## మేడ్చల్ ఐటిఐ వద్ద బస్సు అగ్ని ప్రమాదం కి గురైంది

### మంటలని అదుపు చేసిన అగ్నిమాపక సిబ్బంది



**మేడ్చల్ వాస్తవ తెలంగాణ** మేడ్చల్ నేషనల్ హైవే 44 పై మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రైవేటు బస్సులో మంటలు చెలరేగి, పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటన గురువారం ఉదయం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం మేడ్చల్ మండలంలోని బండ మైలారం నుండి కొంపల్లికి వెళ్తుండగా మేడ్చల్ ఐటిఐ వద్దకు రాగానే ఓ ప్రైవేట్ బస్సు లో మంటలు ఒకసారిగా చెలరేగాయి.దీంతో డ్రైవర్ అప్రమత్తమై బస్సును పక్కకు ఆపాడు. క్షణాలో బస్సు మొత్తం పూర్తిగా దగ్ధమైంది. బస్సులో ఎవరు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. షార్ట్ సర్క్యూట్ ద్వారానే బస్సు దగ్ధమైందని డ్రైవర్ తెలిపారు. సంఘటనా స్థలానికి ఫైర్స్ ఇంజన్ నీ చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు. ఘటన స్థలానికి మేడ్చల్ పోలీసులు చేరుకొని పూర్తి వివరాలను సేకరిస్తున్నారు.

## ఎంఆర్ఎఫ్ మెదక్ ప్లాంట్ లో కార్మిక సంఘం మే 28ఎన్నికలు



**సదాశివపేట వాస్తవ తెలంగాణ న్యూస్**

సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం ఎంఆర్ఎఫ్ మే 28 కార్మిక సంఘం ఎన్నికల కెపిఎస్ యూనియన్ అధ్యక్షులు కొత్త గొల్ల చంద్రశేఖర్: కెపిఎస్ యూనియన్ అధ్యక్షుడు కొత్తగొల్ల చంద్రశేఖర్ : ఏంఆర్ఎఫ్ కంపెనీ మెదక్ ప్లాంట్ లో కార్మిక సంఘం ఎన్నికలు ఈ నెల 28న నిర్వహించడానికి కార్మిక శాఖ సిద్ధంగా ఉందని కేపీ ఎస్ కార్మిక సంఘం అధ్యక్షుడు కొత్త గొల్ల చంద్ర శేఖర్ తెలిపారు. గురువారం సంగారెడ్డిలో డిప్యూటీ లేబర్ కమిషనర్ రవీందర్ రెడ్డి ని కలిసిన అనంతరం కేపీ ఎస్ యూనియన్ అధ్యక్షుడు కొత్తగొల్ల చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎంఆర్ఎఫ్ మెదక్ ప్లాంట్లో ఈనెల 28న జరిగే ఎన్నికల్లో కేపీఎస్ ను గెలిపించాలని కార్మికుల హక్కుల కోసం కెపిఎస్ యూనియన్ పనిచేస్తుందని చెప్పారు. ఈ నెల 27వ తేదీన ఏం ఆర్ ఆఫ్ మెదక్ ప్లాంట్ కార్మికుల తో ఎన్నికల ప్రచారం కోసం కంపెనీ ముందు గేట్ మీటింగ్ ఉంటుందని కార్మికులు సమావేశానికి పెద్ద సంఖ్యలో తరలి రావాలని కోరారు. కార్మికులు టైగర్ గుర్తు పై ఓటేసి కే పి ఎస్ యూనియన్ ను గెలిపించాలని కోరారు. కెపిఎస్ కు ఏఐటీయుసీ మద్దతు తెలపాలని అన్నారు

## 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు ఏఐకేఎంఎస్ మద్దతు

**మహబూబాబాద్ :** కార్మిక సంఘాలు ఈనెల 20న ఇచ్చిన దేశ వ్యాపిత సార్వత్రిక సమ్మెకు అఖిలభారత రైతు కూలీ సంఘం ఏఐకేఎంఎస్ సంపూర్ణ మద్దతును తెలియజేస్తూ ఆరోజు జరుగు సమ్మెలో కార్మిక కర్షకులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ గుజ్జు దేవేందర్ పిలుపునిచ్చారు. అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా ఆఫీసు బేరర్ సమావేశం మహబూబాబాద్ పట్టణంలోని బట్టు అంజయ్య స్మారక భవనంలో జిల్లా అధ్యక్షులు కామ్రేడ్ బండారి ఐలయ్య అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కామ్రేడ్ గుజ్జు దేవేందర్ మాట్లాడుతూ కార్మిక కర్షకుల హక్కుల హరించే విధానాలను వ్యతిరేకిస్తూ కార్పొరేట్ శక్తుల ఊడిగం చేస్తున్న మూడు విధానాలను నిరసిస్తూ కార్మిక సంఘాలు ఇచ్చిన దేశోక్య సాత్విక సమ్మెకు రైతు సోదరులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఈనెల 16 నుండి 19వరకు అన్ని గ్రామాలలో మన సంఘం ఆధ్వర్యంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని కార్మికులు చేసే పోరాటానికి మన సంఘం తరఫున ప్రచారం చేస్తూ సంఘీభావం తెలియ జేయవలసింది గా గ్రామీణ భారత్ బంద్ ను మన సంఘ కార్య కర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయవలసిందిగా పిలుపునిస్తున్నాం. సమావేశంలో నాయకులు మైనం యాకయ్య జి సక్రు యాదగిరి యుగంధర్ గజ్జి లింగన్న ఎస్కే తాజ్ పాషా, సామ పాపయ్య, హెచ్ , లింగన్న తదితరులు పాల్గొన్నారు.

## ఆదమరిస్తే అంతే., చిన్నారులు జరభద్రం

### పార్కింగ్ చేసే కార్లలో పిల్లలు ఎక్కకుండా చూడాలి -- ఎస్పీ నరసింహ

**సూర్యాపేట:** వేసవికాలంలో పార్క్ చేసిన వాహనా ల్లోకి అనుకోకుండా వెళ్ళిన పిల్లలు తీవ్రమైన వేడిమి వల్ల ఊపిరాడక మృతి చెందుతున్న సంఘటనలు చాలా చోట్ల ఇటీవల నమోద్దైనాయి.ఈ నేపథ్యంలో ఇటువంటి సంఘటనలు జరగకుండా ఉండడానికి ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఎస్పి నరసింహ ఐపిఎస్ ప్రకటనలో తెలిపినారు. జాగ్రత్తలు పాటిస్తే ఇలాంటి ఘటనలు జరగకుండా విలువైన చిన్నారుల ప్రాణాలను రక్షించగలం అని ఎస్పి అన్నారు.సూచనలు:వాహనాన్ని లాక్ చేయకముందు వాహనంలో ఎవరైనా ఉన్నారా అని పూర్తిగా తనిఖీ చేసుకోవాలి. ముందు, వెనుక సీట్లను గమనించి పరిశీలించుకోవాలి.పార్క్ చేసే వాహనం లో లేదా వాహనం చుట్టుపక్కల పిల్లలను ఒంటరిగా వదిలివెళ్ళకూడదు.వాహన తాళాలను పిల్ల లకు అందుబాటులో ఉంచకూడదు. అనుకోకుండా వాహనంలోకి వెళ్లి చిక్కుకుపోయే ప్రమాదం గమనించగలరు.వాహనాలు ఆడుకునే ప్రదేశాలు కాదని పిల్లలకు స్పష్టంగా అర్థమయ్యేలా తెలియజేయాలి.వాహనాల్లో ఒంటరిగా ప్రవేశించరాదని వారికి అర్థమయ్యేలా వివరించి చెప్పాలి "రియర్ సీట్ రిమైండర్","చైల్డ్ డిటెక్షన్ అలర్ట్"వంటి భద్రతా పరికరాలను వాహనాల్లో అమర్చండి.వాహనాల విండోలకు బ్లాక్ ఫిల్ములు లేదా అధిక టింటింగ్ ఉపయోగించరాదువాహనంలో ఎవరైనా ఉంటే గుర్తించలేని ప్రమాదం ఉంది.వాహనం వాడకంలో లేకపోయినప్పటికీ డోర్లు, విండోలను పూర్తిగా మూసి లాక్ చేయాలి. పిల్లలు కనిపించకుండా పోతే, వాహనాల్లో, సమీప వాహనాల్లో పరిశీలించాలి.

## లయన్స్ క్లబ్ వారి ఉచిత కంటి వైద్య శిబిరం

**సూర్యాపేట:** లయన్స్ క్లబ్ అఫ్ సూర్యాపేట కంటి ఆసుపత్రి వారు మోదీనా పురం గ్రామంలో గురువారం నాడు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు ఇందులో 7 మంది ని ఉచిత కంటి ఆపరేషన్ కొరకు సూర్యాపేట లయన్స్ కంటి ఆసుపత్రి కి తీసుకెళ్లారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ చైర్మన్ దోసపాటి గోపాల్, ఆర్గనైసింగ్ సెక్రటరీ ఉప్పల రాజేంద్రప్రసాద్, ట్రెసర్రర్ చిలుముల శ్రీనివాస రెడ్డి, మేనేజర్ తల్లాడ మల్లికార్జున్, డాక్టర్ క్రాంతి, విజన్ టెక్నాషియన్ బంగారు స్వాతి, క్యాంపు ఇంచార్జి వీరంద్ర చారీ పాల్గొన్నారు.

# ఏపీలో మరో సైనిక స్కూల్.. కేతనకొండలో నాలుగో పాఠశాల

**నెల్లూరు:**ఏపీలో మరో సైనిక స్కూల్ ఏర్పాటు కానుంది. ఇప్పటివరకు సైనిక స్కూల్ అంటే ఉత్తరాంధ్రలోని కోరుకొండ సైనిక స్కూలు మాత్రమే అందరికి గుర్తుకు వస్తుంది. అయితే పదేళ్ల క్రితం చిత్తూరు జిల్లా కలికిరి, నెల్లూరు జిల్లా క్రిష్ణపట్నంలోనూ సైనిక స్కూల్ ఏర్పాటయ్యాయి. ఇక తాజాగా కేంద్ర ప్రభుత్వం మరో సైనిక స్కూలును రాష్ట్రానికి కేటాయించింది. ఇరి రాష్ట్రం నడిబొడ్డున ఉన్న విజయవాడలో ఏర్పాటు కానుంది. విద్యాభారతి ఆధ్వర్యంలో ప్రారంభించనున్న సైనిక స్కూల్ ఈ ఏడాది నుంచి ప్రవేశాలు జరగనున్నాయి.



విజయవాడకు సమీపంలోని కేతనకొండలో కొత్తగా సైనిక స్కూల్ ఏర్పాటుకు కేంద్రం అనుమతిచ్చింది. వచ్చేనెల నుంచి అడ్మిషన్లు, తరగతులు ప్రారంభించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో రాష్ట్రంలో మొత్తం సైనిక స్కూళ్ల సంఖ్య నాలుగుకు చేరనుంది. విద్యాభారతి ఆధ్వర్యంలో నేతాజీ సైనిక స్కూల్ పేరుతో దీనిని ఏర్పాటు చేయనున్నట్లు విద్యాభారతి దక్షిణ మధ్య క్షేత్ర కార్యనిర్వహణ కార్యదర్శి లింగం సుధాకర్ రెడ్డి వెల్లడించారు. సైనిక స్కూల్ ఏర్పాటుకు సంబంధించిన స్థలం, భవన దాత చలసాని బాబూ రాజేంద్రప్రసాద్, నేతాజీ సైనిక స్కూల్ సొసైటీ కార్యదర్శి వాసిరెడ్డి వినోద్ కుమార్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ మాజీ చైర్మను డాక్టర్ సీఎల్ వెంకట్రావు కలిసి సైనిక స్కూల్ బ్రోచర్ ను తాజాగా ఆవిష్కరించారు. ఈ సైనిక స్కూల్ లో ఉభయ తెలుగు రాష్ట్రాల విద్యార్థులకు 67 శాతం కోటా అమలు చేయనున్నారు. లోకల్ కేటగిరీలో ఎక్కువ సీట్లు తెలుగు విద్యార్థులకే కేటాయించారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించే పరీక్షల్లో అర్హత సాధించిన వారికి మాత్రమే ప్రవేశాలు కల్పిస్తారు. సైనిక స్కూల్ లో ప్రవేశాలకు అఖిల భారత స్థాయిలో పరీక్షలు నిర్వహిస్తారు. ఈ ఏడాది అడ్మిషన్లకు ఇప్పటికే పరీక్ష ముగిసింది. ఏటా 6, 9 తరగతిల్లో ప్రవేశాలకు పరీక్షలు నిర్వహిస్తారు.కాగా, కేతనకొండలో ఏర్పాటు కానున్న నేతాజీ సైనిక స్కూల్ ను జూన్ లో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రులు రాజ్ నాథ్ సింగ్, బండి సంజయ్ లను ఆహ్వానించనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. దేశవ్యాప్తంగా 100 సైనిక స్కూళ్లను నడపాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. పబ్లిక్-ప్రైవేటు భాగస్వామ్యంతో నిర్వహించనున్న ఈ పాఠశాలలకు 8 ఎకరాల భూమి, భవనాలు చూపించాల్సివుంటుంది. కాగా, కేతనకొండలో ఏర్పాటు కానున్న సైనిక స్కూల్ ఈ ఏడాది ఆరో తరగతిలో మాత్రమే ప్రవేశాలు జరగనున్నాయి.

# లైవ్‌లోనే దారుణం టిక్‌టాక్ స్టార్‌ను కాల్చి చంపిన ఆగంతకుడు



**గౌడలజారా:**మెక్సికోలో ఒక భయానకమైన సంఘటన చోటు చేసుకుంది. టిక్‌టాక్‌లో బాగా పాపులర్ అయిన వలేరియా మార్కెజ్ (23) అనే యువతిని దారుణంగా హత్య చేశారు. బ్యూటీ, మేకప్ వీడియోలతో టిక్‌టాక్‌లో బాగా పాపులర్ అయిన యువ సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్‌ను లైవ్ స్ట్రీమింగ్ చేస్తుండగానే దారుణంగా కాల్చి చంపేశారు. గౌడలజారా నగరంలోని ఒక బ్యూటీ పార్లర్‌లో ఆమె లైవ్ స్ట్రీమింగ్ చేస్తుండగా.. ఒక వ్యక్తి గదిలోకి వచ్చాడు. "వలెరియా నువ్వేనా?" అని అడిగాడు. ఆమె "అవును" అని చెప్పేలోపే, అతను ఆమె ఛాతీ, తలపై గన్‌తో కాల్చేశాడు. వలెరియా అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. ఈ దారుణ హత్యకు గల కారణాలపై పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనతో ఆమె అభిమానులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు.వలెరియా మార్కెజ్ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉండేది. ముఖ్యంగా టిక్‌టాక్‌లో ఆమెకు పెద్ద సంఖ్యలో ఫాలోవర్లు ఉన్నారు. ఆమె తన లైవ్ స్ట్రీమింగ్‌ల ద్వారా ఎంతో మంది అభిమానులను సంపాదించుకుంది. అయితే, ఇలా లైవ్‌లో ఉండగా ఆమె హత్యకు గురికావడం అందరినీ కలచివేస్తోంది. ఆగంతకుడు నేరుగా గదిలోకి వచ్చి వలెరియాను గుర్తించి కాల్చడం చూస్తుంటే, ఇది పథకం ప్రకారం చేసిన హత్యగా పోలీసులు అనుమానిస్తున్నారు. హత్యకు గల కారణాలు ఇంకా తెలియరాలేదు. వ్యక్తిగత కారణాలా, వ్యాపారపరమైన శత్రుత్వమా లేక మరేదైనా కారణమా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటన మెక్సికోలో సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్ల భద్రతపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. గతంలో కూడా పలువురు సోషల్ మీడియా ప్రముఖులు దాడులకు గురైన సంఘటనలు ఉన్నాయి. దీంతో సోషల్ మీడియాలో తమ అభిప్రాయాలను నిర్భయంగా వ్యక్తం చేసేవారికి భద్రత కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఈ ఘటన మరోసారి గుర్తు చేస్తోంది. పోలీసులు ఆ ఆగంతకుడిని పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. గదిలోని సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలిస్తున్నారు. సాక్షుల వాంగ్మూలాలు నమోదు చేస్తున్నారు. త్వరలోనే హంతకుడిని పట్టుకుంటామని పోలీసులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. వలెరియా మార్కెజ్ హఠాన్మరణంతో ఆమె కుటుంబ సభ్యులు, స్నేహితులు తీవ్ర దుఃఖంలో ఉన్నారు. ఆమె అభిమానులు సోషల్ మీడియా ద్వారా తమ సంతాపం తెలుపుతున్నారు.

# అమ్మకాల్లో వివో.. ఒప్పో.. మోటరోలా పోకో దూకుడు

**హైదరాబాద్:**స్మార్ట్ ఫోన్ల వినియోగం అంతకంతకూ ఎక్కువ అవుతోంది. 5జీ టెక్నాలజీ దీనికితోడు మొబైల్ విప్లవంతో నగరాల్లో మాత్రమే కనిపించే స్మార్ట్ ఫోన్ల వినియోగం టైర్ టూ సిటీస్ తో పాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ అంతకంతకూ ఎక్కువ అవుతోంది. ఇటీవల కాలంలో నగరాల్లో స్మార్ట్ ఫోన్ల అమ్మకాల వృద్ధి రేటు మందగమనంగా మారితే.. అందుకు భిన్నంగా గ్రామీణ ప్రాంతాల్లో మాత్రం వృద్ధి రేటు అంతకంతకూ పెరుగుతుండటం విశేషం. దీంతో మొబైల్ కంపెనీల చూపు చిన్ననగరాలు.. పట్టణాలు.. గ్రామీణ ప్రాంతాల మీద పడింది. తాజాగా 2023- 2024 స్మార్ట్ ఫోన్ల అమ్మకాలకు సంబంధించిన డేటాను విశ్లేషించినప్పుడు ఆసక్తికర అంశాలు వెలుగు చూపాయి. ప్రీమియం ఫోన్ల వినియోగంపై ఆసక్తి చిన్న పట్టణాల్లో పెరుగుతోందని.. దీనికి తోడు 5జీ స్మార్ట్ ఫోన్లు తక్కువ ధరలకే రావటం కూడా వీటిపై మక్కువ పెరుగుతున్నట్లు చెబుతున్నారు. క్వాల్కామ్.. మీడియాటెక్ వంటి చిప్ తయారీ దిగ్గజాలు రూ.12 వేల కంటే తక్కువ స్థాయిలో 5జీ ఫోన్లు లభించేలా చౌకైన 5జీ ప్రాసెసర్లను



అందుబాటులోకి తీసుకురావటం స్మార్ట్ ఫోన్ మొబైల్ మార్కెట్ కు దన్నుగా మారిందని చెప్పాలి.ఇటీవల కాలంలో మధ్యతరగతి కొనుగోలుదారులు సైతం ప్రీమియం ఫోన్లకు అప్ గ్రేడ్ కావటం ఒక పరిణామంగా చెబుతున్నారు. 2024లో దేశీ స్మార్ట్ ఫోన్ పరిశ్రమ మొత్తం ఆదాయం ఆల్ టైం గరిష్ఠమైన 9 శాతం వార్షిక వృద్ధి రేటుకు చేరుకోవటం విశేషం. ప్రస్తుతం దేశంలో ఏటా 15 కోట్ల స్మార్ట్ ఫోన్ల అమ్మకాలకు చేరుకుంది. అయితే.. ఈ ఏడాది అమ్మకాలు ఫ్లాట్ గా ఉన్నట్లు చెబుతున్నారు.2023 - 2024 సంవత్సరాల్లో దిగ్గజ స్మార్ట్ ఫోన్ల కంపెనీల అమ్మకాలు ఎంతలా పెరిగాయన్న విషయం కళ్లకు కట్టేలా గణాంకాలు వెలువడ్డాయి. ఆసక్తికరమైన అంశం ఏమంటే కొన్ని కంపెనీల స్మార్ట్ ఫోన్ల అమ్మకాలు దూసుకెళ్లగా మరికొన్ని కంపెనీల అమ్మకాలు వెనక్కి వెళ్లటం కనిపిస్తుంది.2023తో పోలిస్తే 2024లో అమ్మకాల్లో దూకుడు ప్రదర్శించిన కంపెనీల్లో వివో.. ఒప్పో.. రియల్ మీ.. యాపిల్.. మోటరోలో.. పోకో.. ఐకూలు నిలిస్తే.. తిరోగమనంలో శాంసంగ్.. షావోమీ.. వన్ ప్లస్ కంపెనీలు నిలిచాయి. 30 నగరాల్లో నిర్వహించిన మార్కెట్ అధ్యయనం ప్రకారం బడా నగరాల్లో వార్షిక అమ్మకాల వృద్ధి సింగిల్ డిజిట్ కు పరిమితం అవుతుంటే.. టైర్ 2.. అంతకంటే చిన్న నగరాల్లో మాత్రం అమ్మకాలు డబుల్ డిజిట్ లో ఉండటం ఆసక్తికరంగా మారింది. ఫీచర్స్ ఫోన్స్ వినియోగదారులు అప్ గ్రేడ్ అవుతున్న వైనం గ్రామీణ.. చిన్న పట్టణాల్లో కొట్టొచ్చినట్లుగా కనిపిస్తుందని చెబుతున్నారు.

# ఇస్రో శాటిలైట్స్‌తో ఇండియా ఆపరేషన్ సక్సెస్ 23 నిమిషాల్లో చైనా రాడార్లు ధ్వంసం



**ఢిల్లీ :**పహల్గాం దాడికి ప్రతీకారంగా ఇండియా పాకిస్థాన్‌కు గట్టి బుద్ధి చెప్పింది. 'ఆపరేషన్ సిందూర్' పేరుతో పాకిస్థాన్, పీఓకేలపై భారత సైన్యం మెరుపుదాడులు చేసింది. ఈ దాడుల్లో వందకు పైగా టెర్రరిస్టులను మట్టుబెట్టింది. ఆ తర్వాత పాకిస్థాన్ ఎదురుదాడికి దిగినా, ఇండియా దెబ్బకు బిత్తరపోయింది. ఇండియా దాడులను అడ్డుకోలేక చేతులెత్తేసింది. పాకిస్థాన్‌కు చైనా అండగా నిలిచినా, ఇండియాను ఎదుర్కోవడం వాళ్ల తరం కాలేదు.'ఆపరేషన్ సిందూర్'లో ఇండియా దాడులను ఆపడానికి పాకిస్థాన్ చైనా ఎయిర్ డిఫెన్స్ సాయం కూడా తీసుకుంది. అయినా పాకిస్థాన్‌కు గట్టి దెబ్బ తగిలింది. చైనా ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్‌ను, రాడార్లను ఇండియా కేవలం 23 నిమిషాల్లోనే ధ్వంసం చేసింది. ముందు వాటిని జామ్ చేసింది. ఆ తర్వాత పూర్తిగా పని చేయకుండా చేసేసింది. కరెక్ట్ టార్గెట్‌లతో ఆపరేషన్‌ను సక్సెస్ ఫుల్‌గా పూర్తి చేశామని ఇండియన్ ఆర్మీ అధికారులు చెప్పారు. ఈ ఆపరేషన్‌లో చైనాకు చెందిన పీఎల్-15 మిసైల్స్, టర్కీకి చెందిన యూఏవీలు, లాంగ్ రేంజ్ రాకెట్స్, క్వాడ్ కాప్టర్లు, డ్రోన్స్ లాంటి వాటిని ఇండియన్ ఎయిర్ ఫోర్స్ నాశనం చేసింది. పాకిస్థాన్ లేటెస్ట్ ఆయుధాలు వాడినా, ఇండియా తయారు చేసిన ఎయిర్ డిఫెన్స్, ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ సిస్టమ్స్‌ను ఏమీ చేయలేకపోయాయని అధికారులు తెలిపారు.ఇండియన్ ఎయిర్ ఫోర్స్ నూర్ ఖాన్, రహీమ్ యార్ ఖాన్ లాంటి పాకిస్థాన్ ఎయిర్ బేస్‌లను టార్గెట్ చేసింది. దానితో పాటు సూసైడ్ డ్రోన్స్ వాడి శత్రువు రాడార్లను, మిసైల్ సిస్టమ్స్‌ను, హై వాల్యూ టార్గెట్స్‌ను ధ్వంసం చేసింది. లాటరింగ్ మందుగుండు సామగ్రి అంటే, టార్గెట్ ఏరియా చుట్టూ తిరుగుతూ, కరెక్ట్ టార్గెట్ కోసం వెతికి, దాడి చేసే ఆయుధాలు. వాటినే ఇండియా వాడింది. ఇండియా లేటెస్ట్ టెక్నాలజీతో ఆపరేషన్ సిందూర్‌ను సక్సెస్ ఫుల్‌గా పూర్తి చేశామని చెప్పారు.సిందూర్ ఆపరేషన్‌లో ఇస్రో కూడా కీలక పాత్ర పోషించిందని ఇండియన్ ఆర్మీ చెప్పింది. ఆపరేషన్ సిందూర్ టైమ్‌లో మే 11 నుంచి దేశ పౌరుల భద్రత, వ్యూహాత్మక ప్రయోజనం కోసం కనీసం 10 శాటిలైట్స్ 24 గంటలూ పనిచేస్తున్నాయని అధికారులు తెలిపారు. ఆపరేషన్ సిందూర్ కేవలం వ్యూహాత్మక విజయం మాత్రమే కాదు. ఇది ఇండియా డిఫెన్స్ స్వదేశీకరణ విధానాలను ప్రపంచానికి చాటి చెప్పింది. ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్ నుంచి డ్రోన్స్ వరకు ఇండియా స్వదేశీ టెక్నాలజీని అత్యంత ముఖ్యమైన సమయంలో అందించింది. ఇండియా 21వ శతాబ్దంలో హైటెక్ మిలిటరీ పవర్‌గా తన పాత్రను సక్సెస్ ఫుల్‌గా నిరూపించుకుందని తెలిపారు.

# పాక్ అబద్ధాలకు చెక్.. ఆదంపుర్‌లో ఎస్-400 క్షేమం

**ఢిల్లీ :**పాకిస్థాన్ ఆర్మీ హెడ్‌క్వార్టర్స్‌కు కేవలం కొద్ది దూరంలో ఉన్న నూర్ ఖాన్ ఎయిర్‌బేస్‌ను భారత్ చావు దెబ్బ తీయడంతో, కంగుతిన్న పాకిస్థాన్.. తమ పరువు కాపాడుకోవడానికి ఆదంపుర్‌పై దాడి చేసి ఎస్-400ని ధ్వంసం చేశామని ఒక పచ్చి అబద్ధాన్ని ప్రచారం చేయడం మొదలుపెట్టింది. అయితే, భారత ప్రధాని మోదీ స్వయంగా ఆదంపుర్‌ను సందర్శించి, అక్కడ ఎస్-400, మిగ్-29 యుద్ధ విమానాలు క్షేమంగా ఉన్నాయని ప్రపంచానికి చాటిచెప్పారు. వాస్తవానికి వ్యూహాత్మకంగా ఆదంపుర్ వైమానిక స్థావరానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. భారత్-పాకిస్థాన్ మధ్య జరిగిన ప్రతి యుద్ధంలోనూ శత్రుదేశానికి ఇది మొదటి టార్గెట్‌గా మారినా, తన ఉక్కు సంకల్పంతో అన్ని దాడులను తట్టుకొని గంభీరంగా నిలబడింది.ఆదంపుర్ వైమానిక స్థావరాన్ని 1950లలో ఏర్పాటు చేశారు. ఇది పంజాబ్‌లోని జలంధర్ నగరానికి అతి దగ్గరలో ఉంటుంది. ఇక్కడి నుంచి పాకిస్థాన్ సరిహద్దు కేవలం 100 కిలోమీటర్ల దూరం మాత్రమే. ఇది భారతదేశంలోని రెండవ అతిపెద్ద వైమానిక స్థావరంగా గుర్తింపు పొందింది. గడిచిన 75 ఏళ్లుగా పాకిస్థాన్ రాడార్‌లో నిత్యం గురిపెట్టినా, ఈ స్థావరం మాత్రం చెక్కుచెదరని ఉక్కు కోటలా నిలబడింది. పాకిస్థాన్ ఎల్లప్పుడూ దీని భద్రతా వ్యవస్థలోకి చొరబడాలని కుట్రలు పన్నుతూనే ఉంటుంది. ఈ నెల 9-10 తేదీల్లో పాకిస్థాన్ ఏకంగా 6 క్షిపణులను ప్రయోగించగా, వాటన్నింటినీ భారత రక్షణ వ్యవస్థ కేవలం



ఏడు కిలోమీటర్ల దూరంలోనే నేలకూల్చింది.ఈ స్థావరం భారత వైమానిక దళానికి చెందిన అత్యంత కీలకమైన 47వ స్క్వాడ్రన్‌కు ప్రధాన స్థావరం. ఈ స్క్వాడ్రన్‌ను 'బ్లాక్ ఆర్చర్స్' అని కూడా పిలుస్తారు. దీనితో పాటు, 'ఫస్ట్ సూపర్‌సోనిక్స్'గా పేరుగాంచిన 28వ స్క్వాడ్రన్ కూడా ఇక్కడే ఉంటుంది. ఈ రెండు స్క్వాడ్రన్‌లు ఈ స్థావరం రోజువారీ కార్యకలాపాలకు వెన్నెముకలాంటివి.వ్యూహాత్మకంగా ఆదంపుర్ ఒక తిరుగులేని శక్తి కేంద్రం. దీని చుట్టుపక్కల కేవలం 150 కిలోమీటర్ల పరిధిలోనే అత్యాధునిక ఆపాచీ హెలికాప్టర్లు ఉన్న పఠాన్‌కోట్, సుఖోయ్-30 ఎంకేఐ యుద్ధ విమానాలు ఉన్న హల్వారా, పాకిస్థాన్ సరిహద్దుల్లోని అమృత్‌సర్, రఫేల్ యుద్ధ విమానాల కేంద్రమైన బఠిండా, చండీగఢ్ వైమానిక స్థావరాలు ఉన్నాయి. వీటన్నింటినీ ఒక గ్రిడ్ వలె అనుసంధానిస్తూ ఆదంపుర్ ఎయిర్‌బేస్ తనదైన ముద్ర వేస్తోంది. ఈ నేపథ్యంలోనే అత్యాధునిక ఎస్-400 గగనతల రక్షణ వ్యవస్థ మొదటి రెజిమెంట్‌ను ఇక్కడే మోహరించారు. దీనితో పశ్చిమ సరిహద్దులు ఈ శక్తివంతమైన రక్షణ ఛత్రం కిందకు వచ్చాయి. 1965లో పాకిస్థాన్ వైమానిక దళం ఆదంపుర్‌పై ముందస్తు దాడికి తెగబడింది. ఆ తర్వాత 135 మంది స్పెషల్ సర్వీస్ గ్రూప్ పారా కమాండోలను ఇక్కడ ఎయిర్ డ్రాప్ చేసింది. కానీ, అప్రమత్తమైన భారత గ్రామీణ ప్రజలు ఆ కమాండోలలో చాలా మందిని పట్టుకొని మన దళాలకు అప్పగించారు. మిగిలిన కమాండోలు ప్రాణాలతో బయటపడటానికి పాకిస్థాన్‌కు పారిపోయారు. ఆ సమయంలో ఈ ఎయిర్‌బేస్‌లో వైమానిక దళం 1వ స్క్వాడ్రన్ ఉండేది. అది సర్గోదా సహా పాకిస్థాన్ ఇతర కీలక వైమానిక స్థావరాలను ధ్వంసం చేసింది.ఇక 1971 యుద్ధ సమయంలో పఠాన్‌కోట్‌లోని రన్‌వేను పాకిస్థాన్ ధ్వంసం చేయగా, ఆదంపుర్ నుంచే యుద్ధ విమానాలు గాల్లోకి ఎగిరి ఆ ఎయిర్‌బేస్‌కు రక్షణ కల్పించాయి. ఆ యుద్ధం మొత్తం ఈ స్థావరం పూర్తి శక్తి సామర్థ్యాలతో పనిచేసింది. 1999 కార్గిల్ యుద్ధంలో కూడా ఇక్కడి నుంచే మిరాజ్ 2000 విమానాలు బయల్దేరి శత్రువుల బంకర్లను ధ్వంసం చేశాయి. టైగర్ హిల్స్, టోలోలింగ్ శిఖరాలను తిరిగి స్వాధీనం చేసుకోవడంలో ఈ స్థావరం కీలక పాత్ర పోషించింది.

# చీఫ్ సెక్రటరీ, అధికారులను జైలుకు పంపిస్తాం



**హైదరాబాద్:**హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ గచ్చిబౌలి భూముల విషయంలో సుప్రీ ంకోర్టు మరోసారి తెలంగాణ ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయి నేతృత్వంలోని ధర్మాసనం ఈ కేసును విచారిస్తూ కీలక వ్యాఖ్యలు చేసింది.

అటవీ ప్రాంతాన్ని పునరుద్ధరించడంలో జాప్యం చేస్తే చీఫ్ సెక్రటరీతో పాటు సంబంధిత అధికారులను జైలుకు పంపిస్తామని సుప్రీంకోర్టు తీవ్రంగా హెచ్చరించింది. 'కంచె గచ్చిబౌలిలో అటవీ ప్రాంతం పునరుద్ధరించకపోతే చీఫ్ సెక్రటరీ మరియు అధికారులను జైలుకు పంపిస్తాం" అని ధర్మాసనం స్పష్టం చేసింది.విచారణ సందర్భంగా చీఫ్ జస్టిస్ గవాయి పలు ప్రశ్నలు సంధించారు. "అన్నీ సక్రమంగా ఉంటే సెలవులున్న సమయంలో ఎందుకు పని ప్రారంభించారు? సోమవారం చేసుకోవచ్చు కదా?" అని ఆయన ప్రశ్నించారు. వేల సంఖ్యలో చెట్లను అక్రమంగా కొట్టేశారని, వాటిని వెంటనే పునరుద్ధరించాలని ఆదేశించారు. "వేల చెట్లు అక్రమంగా కొట్టేశారు. అవన్నీ త్వరగా పునరుద్ధరణ చేయాలి" అని ఆయన అన్నారు.ప్రభుత్వం వ్యవహరించిన తీరును తప్పుబడుతూ, "ఇష్టానుసారంగా డజన్ల కొద్దీ బుల్డోజర్లు పెట్టి చెట్లను తొలగించారు. ఇదంతా ముందస్తు పథకం ప్రకారమే చేసినట్టు కనిపిస్తుంది" అని సీజేఐ వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు ప్రభుత్వానికి మరింత ఇబ్బంది కలిగించేలా ఉన్నాయి.తదుపరి విచారణను జూలై 23వ తేదీకి వాయిదా వేస్తూ ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. అటవీ ప్రాంత పునరుద్ధరణకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో వేచి చూడాల్సి ఉంది. సుప్రీంకోర్టు యొక్క ఈ హెచ్చరికలు తెలంగాణ ప్రభుత్వానికి ఒక బలమైన సంకేతంగా పరిగణించవచ్చు.

# 21 ఎన్ కౌంటర్లు.. ముగిసిన ఆపరేషన్ కర్రెగుట్టలు




**ఛత్తీస్‌ఘడ్:**తెలంగాణ, ఛత్తీస్‌ఘడ్ సరిహద్దుల్లో మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా కొనసాగిన ఆపరేషన్ ముగిసింది. ఆపరేషన్ కగార్ పేరిట దండకారణ్యంలో మావోయిస్టుల ఏరివేత ఎక్కువగా ఉండటంతో పలువురు మావోయిస్టులు, సెంట్రల్ కమిటీ నేతలు రెండు రాష్ట్రాల సరిహద్దుల్లోని కర్రె గుట్టల్లో తలదాచుకున్నట్లు భద్రతా బలగాలు గుర్తించాయి. గత నెల 21న పెద్దఎత్తున కర్రె గుట్టల వద్దకు చేరుకున్న బలగాలు స్పెషల్ ఆపరేషన్ చేపట్టాయి. ఇలా మొత్తం 21 రోజులు పాటు గాలించగా, ప్రతిరోజూ ఎదురుకాల్పులతో కర్రె గుట్టల్లో భీకర యుద్ధం జరిగింది. ఈ ఘటనల్లో మొత్తం 31 మంది మావోయిస్టులు మరణించినట్లు భద్రతా బలగాలు ప్రకటించాయి.ఆపరేషన్ కర్రె గుట్టల్లో మొత్తం 31 మంది మావోయిస్టులు హతమైనట్లు సీఆర్‌పీఎఫ్ డీజీ జ్ఞానేంద్ర ప్రతాప్(జీపీ)తోపాటు ఛత్తీస్‌ఘడ్ డీజీపీ అరుణ్ దేవ్ గౌతమ్ అధికారికంగా ప్రకటించారు. గత నెలలో ప్రారంభించిన ఆపరేషన్ 21 రోజులు కొనసాగిందని, మొత్తం 21 ఎన్‌కౌంటర్లు జరిగాయని వారు వెల్లడించారు. మావోయిస్టు సమస్య అంతానికి ఇది ఆరంభమేనని, లొంగిపోవడం తప్ప మావోయిస్టులకు మరో మార్గం లేదని స్పష్టం చేశారు.తెలంగాణ మావో యిస్టు పార్టీ, ఛత్తీస్‌ఘడ్ నక్సల్స్ కర్రె గుట్టల్లో ఉన్నట్లు సమాచారం రావడంతో ఏప్రిల్ 21న ఆపరేషన్ ప్రారంభించినట్లు తెలిపారు. అత్యంత కఠిన పరిస్థితుల్లో బలగాలు కూంబింగ్ జరప గా, మావోయిస్టులు కాల్పులు జరపడంతో 21 సార్లు ఎదురుకాల్పులు జరపాల్సివచ్చిందని వెల్లడిం చారు. అంతేకాకుండా 450 బీరు బాంబులు, ఐఈడీలను గుర్తించి నిర్వీర్యం చేసినట్లు తెలిపారు. మరణించిన 31 మంది మావోయిస్టుల్లో ఇప్పటివరకు 28 మంది మాత్రమే గుర్తించారు.

## ఆపరేషన్ సిందూర్ వేళ భారత్ పై పాక్ అనుకూల గ్రూపుల

**ఢిల్లీ :**భారత్ తన 'ఆపరేషన్ సిందూర్' మిషన్ లో కీలక దశలో నిమగ్నమై ఉన్న సమయంలోనే, పాకిస్థాన్ , దానితో అనుబంధం కలిగిన ముస్లిం దేశాల నుంచి భారత్‌పై భారీ ఎత్తున సైబర్ దాడులు జరిగినట్లు భారత దర్యాప్తు సంస్థలు గుర్తించాయి. ఈ దాడుల్లో ప్రభుత్వ మద్దతు ఉన్న, అలాగే ప్రభుత్వేతర హ్యాకింగ్ గ్రూపులు పాలుపంచుకున్నాయని



విశ్లేషణలో వెల్లడైంది. పాకిస్థాన్, తుర్కియే, బంగ్లాదేశ్, మలేషియా, ఇండోనేషియా, ఇరాక్, చైనాకు సంబంధించిన గ్రూపులు ఈ సైబర్ దాడులకు పాల్పడినట్లు నిపుణులు గుర్తించారు. ముఖ్యంగా ప్రభుత్వ రంగ సంస్థలు, ఎంఎస్ఎంఈలు, పోర్టులు, ఎయిర్‌పోర్టులు, పవర్‌గ్రిడ్‌లు, రవాణా సేవలు వంటి కీలక మౌలిక సదుపాయాలను ఇవి లక్ష్యంగా చేసుకున్నాయి. బీఎస్ఎన్ఎల్, యూపీఐ, డిజిటల్ వాలెట్లు, స్టాక్ ఎక్స్ఛేంజీలు, పెద్ద కంపెనీలు కూడా ఈ దాడుల జాబితాలో ఉన్నాయి. రక్షణ రంగ సంస్థల నుంచి కూడా కీలక డేటాను దొంగిలించే ప్రయత్నాలు జరిగాయి. భారత డిజిటల్ ఆస్తులపై పాకిస్థాన్ జరిపిన సైబర్ యుద్ధంగా దీనిని ఇంటర్పోల్ ట్రైనర్ పెండ్యాల కృష్ణశాస్త్రి అభివర్ణించారు.ఇటీవల ది సెంట్రల్ కోల్ ఫీల్డ్స్ లిమిటెడ్ సైబర్ దాడికి గురైనప్పుడు, దాని సిస్టమ్‌లో 'మిస్టర్ హాబిబ్404' పేరుతో "సురక్షితమే అని మీరు అనుకుంటున్నారా... మేము ఇక్కడే ఉన్నాం" అనే సందేశం కనిపించింది.

# ఇదేం వెర్రి కామెడీ ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ సీరియస్



**గుంటూరు:**ప్రస్తుత సమాజంలో సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్ల జోరు పెరిగిపోయింది. ఎక్కడ పడితే అక్కడ రీల్స్ , ఛాలెంజ్ వీడియోలు , ప్రాంక్స్ చేస్తూ సోషల్ మీడియాలో హడావిడి చేస్తున్నారు. ఫ్యాన్ ఫాలోయింగ్ కోసం చిరాకు కలిగించే పిచ్చి కామెడీలు చేసి నానా రచ్చ చేస్తున్నారు. ఇక అటువంటి వారి విషయంలో ఆర్టిసి ఎండి వీసీ సజ్జనార్ పోస్ట్ పెట్టారు.వీడియోను పోస్ట్ చేసి ఘాటుగా స్పందించిన సజ్జనార్ఏం కామెడీగా ఉందా? ఏంటా పిచ్చి వేషాలు అంటూ సీరియస్ అయిన ఆయన, ఓ వీడియోను పోస్ట్ చేసి ఘాటుగా స్పందించారు. వీసీ సజ్జనార్ పోస్ట్ చేసిన వీడియోలో ఒక వ్యక్తి కదులుతున్న ఆర్టీసీ బస్సు వద్దకు వెళ్లి, లోపల ఉన్న కండక్టర్ ను గుంటూరు వెళ్లాలంటూ అడుగుతాడు.ఆర్టీసీ కండక్టర్ ఆ బస్సు గుంటూరు వెళ్లదని చెప్పడంతో, కాలికున్న చెప్పు తీసి చెవి దగ్గర పెట్టుకొని అరే.. ఈ బస్సు గుంటూరు వెళ్ళదు అంటరా అంటూ ఎవరికో చెబుతున్నట్టు యాక్ట్ చేస్తాడు. ఇక ఈ వీడియోను పోస్ట్ చేసిన సజ్జనార్ సదరు వ్యక్తి పైత్యానికి ఆగ్రహం వ్యక్తం చేశారు.వీడికి ఏమైనా పిచ్చా , వెర్రా?చెప్పు చెవి దగ్గర పెట్టుకుని స్నేహితుడితో మాట్లాడుతున్నట్టు సదరు యువకుడు వెళ్లి పోతుండడంతో బస్సులో ఉన్న ప్రయాణికులతో పాటు రోడ్డు మీద ఉన్న ప్రయాణికులు కూడా అతని వంకే చూస్తారు.

# విశాఖ ప్రయాణికులకు గుడ్ న్యూస్..

**హైదరాబాద్:** వేసవి సెలవుల నేపథ్యంలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దక్షిణ మధ్య రైల్వే కీలక నిర్ణయం తీసుకుంది. ప్రయాణికుల సౌకర్యార్థం చర్లపల్లి, విశాఖపట్నం మధ్య ప్రత్యేక రైలు సర్వీసులను నడపనున్నట్లు ప్రకటించింది.ఈ ప్రత్యేక రైలు వివరాలు ఇలా ఉన్నాయి:ట్రైన్ నెం. 07441 (చర్లపల్లి - విశాఖపట్నం): ఈ రైలు మే 17, 2025 శనివారం మధ్యాహ్నం 2గంటలకు చర్లపల్లి నుంచి బయలుదేరి మరుసటి రోజు అంటే 18వ తేదీ ఆదివారం తెల్లవారుజామున 3గంటల 35 నిమిషాలకు విశాఖపట్నం చేరుకుంటుంది.ట్రైన్ నెం. 07442 (విశాఖపట్నం - చర్లపల్లి): తిరుగు ప్రయాణంలో ఈ రైలు మే 18,2025 ఆదివారం రోజున రాత్రి 11 గంటలకు విశాఖపట్నం నుంచి బయలుదేరి 19వ తేదీ సోమవారం ఉదయం 11 గంటల 40 నిమిషాలకు చర్లపల్లికి చేరుకుంటుంది.ఇక ఈ స్పెషల్ ట్రైన్స్ నల్లగొండ, మిరియాలగూడ,నడికుడి,గుంటూరు, విజయవాడ ,ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట,అన్నవరం, దువ్వాడ స్టేషన్లలో ఆగుతుందని రైల్వే అధికారులు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.ఈ ప్రత్యేక సర్వీసుల ద్వారా చర్లపల్లి మరియు విశాఖపట్నం మధ్య ప్రయాణించే వారికి మెరుగైన సౌకర్యం లభించనుంది.



# శాంతి మంత్రాలకు చింతకాయలు రాలవు!



భారత్‌తో యుద్ధం గెలిచామని తమ సొంత ప్రజలను నమ్మించేందుకు పాక్ చేయని ప్రయత్నం లేదు. చివరకు విజయోత్సవాలను కూడా నిర్వహించుకుంది. ట్రంప్ కూడా తనవల్లనే యుద్ధం ఆగిందని ప్రచారం చేసుకుంటున్నారు. ప్రచార కండూతి ఇద్దరిలోనూ కనిపిస్తోంది. అయితే ఇందులో ఏది నిజమో భారత్‌ను చూస్తే తెలుస్తుంది. పాక్ ఎందుకు కాళ్లబేరానికి వచ్చిందో చెప్పాలి. ప్రపంచాన్ని బెదిరించి పబ్బం గడుపు కునే దుస్థితిలో ట్రంప్ ఉన్నారు. అడుక్కుతినే దుస్థితిలో పాక్ ఉంది. పాక్ ముందు నుంచి నిజాయితీ ఉన్ దేశంగా పేరు సంపాదించుకోలేదు.యుద్ధాన్ని తానే ఆపానని ఓ వైపు డొనాల్డ్ ట్రంప్ ప్రచారం చేసుకుం టుంటే...మరో వైపు పాకిస్తాన్ తామే యుద్ధంలో గెలిచామని ప్రచారం చేసుకుంటోంది. డొనాల్డ్ ట్రంప్, పాకిస్తాన్‌లు చేసుకుంటున్న ప్రచారంపై అమెరికాతో సహ ప్రపంచ దేశాలు నివ్వెరపోయి చూస్తున్నాయి. భారత్ దెబ్బకు దిమ్మతిరిగి మైండ్ బ్లాక్ అయిన పాక్..నిజాయితీగా బతకాలన్న ఆలోచన చేయడం లేదు. ఇండియా పాకిస్తాన్‌ల మధ్య యుద్ధం కాల్పులు మొదలైన మూడు రోజులకే ముగిసిన సంగతి తెలిసిందే. ఎందుకు ముగిసాయన్నది పాక్‌కు బాగా తెలుసు. భారత్ కొట్టిన దెబ్బకు పాక్ కూసాలు కదిలిపోయాయి. మిస్సైల్స్, డ్రోన్ల దాడి కారణంగా భారీ ఆస్తినష్టం సంభవించింది. ఒకరకంగా పాక్‌పై కోలుకోలేని దెబ్బ పడింది. యుద్ధం ఇలాగే కొనసాగితే దేశం సర్వ నాశనం అవుతుందని పాక్ భావించింది. వెంటనే కాళ్ల బేరానికి వచ్చింది. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సాయంతో కాల్పుల విరమణ ఒప్పందాన్ని కుదుర్చుకుంది. దీంతో కాల్పుల కొనసాగింపు ఆగిపోయింది. అయితే భారత్ మాత్రం ఆపరేషన్ సింధూర్ నిలిచి పోయిందని, ఎప్ఉడైనా కొనసాగుతుందని గట్టిగా హెచ్చరించింది. మోడీ జాతిని ఉద్దేశించి చేసిన ప్రసంగం తరవాత దేశంతో పాటు, ప్రపంచానికి కూడా భారత్ సత్తా ఏమిటో మరోమారు తెలిసిపోయింది. ఇండియా దెబ్బకు తోకుముడిచిన కుక్కలా పాకిస్తాన్ బిక్కచచ్చిపోయింది. దాడులు, కాల్పుల విరమణ కోసం పరుగులు తీసింది. యుద్ధంలో పాకిస్తాన్ దారుణంగా దెబ్బతింది. ఇండియా డిప్లమేటిక్‌గా.. మిలటరీ పరంగా విజయం సాధించింది. ఇండియా ఎందుకు విజయం సాధించిందనే దానికి పటిష్టమైన నాయకత్వం, మిటిటరీ ఆధునీకరణ అని చెప్పక తప్పదు. గత కొన్ని వేల సంవత్సరాలుగా పరాయి పాలనలో మగ్గిన భారత్ స్వయం సమృద్ధి సాధించి, సైనికంగా బలోపేతం అయ్యింది. ఎదుటి వారు దాడిచేస్తే దెబ్బ కొట్టాల్సిందేనన్న లక్ష్యంతో పనిచేస్తోంది. చెంపకుచెంప కాదు...కాల్లు విరగ్గొడతామన్న ధైర్యాన్ని చూపిస్తోంది. ఈ విషయం పాకిస్తాన్‌కే బాగా తెలుసు. వరుసగా ఉగ్రదాడులతో భారత్‌ను దెబ్బకొట్టాలని చూసిన పాక్ ఇప్పుడు దెబ్బతింది. ఇక జీవితంలో మరువలేని అనుభవాన్ని సంపాదించింది. ఇకనుంచి ఉగ్రదాడులకు దాడులతోనే భారత్ సమాధానం చెబుతుందన్న విషయం ప్రధాని మోడీ స్పష్టం చేశారు. ఇకపోతే ఇప్పుడు అందరి చూపు.. పాకిస్తాన్ టెర్రరిస్టులను పెంచి పోషిస్తున్న విషయం వైపే ఉంది. టెర్రరిస్టులు చనిపోయినపుడు ఆర్మీ అధికారులు యూనిఫామ్‌లో అంత్యక్రియల్లో పాల్గొన్నారు. అంటే దానర్థం.. అక్కడి టెర్రరిస్టులకు.. ఆర్మీ వాళ్లకు తేడా లేదని. పాక్ చరిత్ర గురించి బాగా తెలిసిన వారు..ఈ రెంటికీ విడదీయరాని సంబంధం ఉందని గుర్తించారు. ఇండియాతో యుద్ధం చేసి ఓడిపోయిన ప్రతీసారి తామే గెలిచామని పాకిస్తాన్ జబ్బలు చరుచుకుంటోంది. అందుకే ఉగ్రవాదులకు ఊతమిచ్చే చర్యలను పక్కన పెట్టి పాకిస్తాన్ తన సొంత ఇంటిని శుభ్రం చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఇక బంగ్లా యుద్ధంనాటి 1971తో పోల్చితే మన దేశం ఆర్థికంగా ఎన్నో రెట్లు బలపడింది. మన సైనిక శక్తి పాటవాలు కూడా అనేక రెట్లు పెరిగాయి. అందుకే డ్రోన్లు, క్షిపణులతో పాకిస్థాన్ దాడులు చేసినప్పటికీ సమర్థంగా తిప్పి కొట్టాం. అలాగే ప్రతిదాడితో దాని పక్కటెముకలను విరగొట్టాం. మనవైపు చెప్పుకోదగిన నష్టం ఏమీ జరగలేదు. అంతర్జాతీయ సమీకరణాలు... 1971లో పాక్‌కు దన్నుగా అమెరికా, బ్రిటన్, చైనా వంటి దేశాలు నిలవగా... మన దేశానికి సమైక్య రష్యా మాత్రమే అండగా ఉండింది. ఇప్పుడు వాతావరణం మారింది. భారత్ శాస్త్ర సాంకేతికరంగంలో దూసుకు పోతోంది. భారతదేశం కూడా బలమైన ఆర్థిక శక్తిగా ఎదుగుతోంది. దీంతో భారత్ నుంచి ముప్పు తప్పదని భావించిన చైనా మనతో శత్రుత్వం పెంచుకుంటోంది. చైనాకు సామంత దేశంగా ఉండటానికి భారత్ ఎప్పటికీ అంగీకరించదు. ఈ కారణంగా చైనా వ్యూహాత్మకం గా పాకిస్థాన్‌ను చేరదీస్తోంది. దాయాది దేశానికి వివిధ రూపాల్లో సహాయం చేస్తోంది. మొన్నటికి మొన్న కూడా సైనికి సాయం చేసి భంగపడింది. అందుకే అరుణాల్ విషయంలో పేచీలు పటెట్ఇ కెలక్కుంటోంది. ఇక అమెరికా కూడా చైనా ఎదుగుదలను నిరోధించే క్రమంలో దానితో సై అంటోంది. భవిష్యత్తులో చైనాతో తలపడాల్సి వస్తే భౌగోళికంగా పాక్ భూభాగం అమెరికాకు కావాలి. ఈ కారణంగా ఉగ్రవాదంపై తమది రాజీ లేని పోరు అంటూనే అమెరికా దొడ్డి దారిన పాకిస్థాన్‌కు సహాయం చేస్తోంది. ఈ నేపథ్యంలో సైనికపరంగా అత్యంత శక్తిమంతంగా ఉన్న రష్యా మాత్రమే ఎప్పటికైనా మనకు అంతో ఇంతో అండగా నిలవొచ్చు. పశ్చిమ దేశాలతో ఉన్న వైరం కారణంగా రష్యా కూడా చైనాకు పూర్తి వ్యతిరేకంగా వ్యవహరించే పరిస్థితి లేదు. ఈ కారణంగానే ఉగ్రవాదాన్ని పెంచిపోషిస్తున్న పాకిస్థాన్‌కు ఆర్థిక సహాయం చేయవద్దని అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థకు భారత్ విజ్ఞప్తి చేసినా..డే వంద కోట్ల డాలర్ల సహాయం అందించడానికి అంగీకారం తెలిపింది. యుద్ధాలను భరించే స్థితిలో ప్రపంచ దేశాలు ఇప్పుడు లేవు. ఐదు దశాబ్దాల క్రితం పరిస్థితులు వేరు. అప్పుడు స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు కూడా లేవు. 1971 యుద్ధ సమయంలో అంతర్జాతీయ పరిణామాలు మన దేశ ప్రజలపై ప్రభావం చూపలేదు. ఇప్పుడు మన దేశం నుంచి ఎగుమతులు, దిగుమ తులు కూడా పెరిగాయి. ఇప్పుడంతా అభివృద్ధి, అర్థిక వృద్ధిపైనే అన్ని దేశాలు దృష్టి సారిస్తున్నాయి. పాక్ ఇందుకు భిన్నంగా ఉగ్రవాదులను ఎగదోస్తోంది. ఇలా ఎంతకాలం చేసినా అది మనుగడ సాగించదని గుర్తిస్తే మంచింది. అలా అని పాకిస్థాన్‌కు గుణపాఠం చెప్పకుండా ఉండలేం. మన దేశంతో యుద్ధం చేసి నెగ్గలేని పాకిస్థాన్ ఉగ్ర మూకలను పెంచి పోషించి మనపైకి ఉసిగొల్పుతోంది. తృతీయ ఆర్థిక శక్తిగా ఎదగాలను కుంటున్న భారత్‌కు ఈ యుద్ధం ప్రతిబంధకమే అవుతుంది. అలా అని చేతులు ముడుచుకొని కూర్చోలేని స్థితి. కశ్మీర్ అందాలను ఆస్వాదించడానికి వెళ్లిన పర్యాటకులను వారి భార్యల కళ్లెదుటే కాల్చి చంపిన ఉగ్రవాదులకు ఆశ్రయం ఇవ్వడం ద్వారా మన దేశాన్ని పాకిస్థానే యుద్ధ రంగంలోకి లాగింది.

# ట్రంప్ వ్యాఖ్యలను పట్టించుకోవద్దు

- **అన్నీ తన ఘనతే అని చాటుకునే రకం**
- **మాజీ అధికారి మైఖేల్ రూబిన్ సంచలన వ్యాఖ్యలు**

**వాషింగ్టన్,మే15:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై ఆ దేశానికి చెందిన మాజీ అధికారి మైఖేల్ రూబిన్ సంచలన కామెంట్లు చేశారు. ట్రంప్ ఓ కామెడీ పీస్ అని, భారతీయులు అతడ్ని పట్టించు కోవాల్సిన పని లేదని అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. భారత్, పాకిస్తాన్‌ల మధ్య యుద్ధం ఆపింది తానేనని ట్రంప్ ప్రచారం చేసుకుంటున్న సంగతి తెలిసిందే. భారత్, పాకిస్తాన్‌లు కలిసి భోజనం కూడా చేయాలని ట్రంప్ అన్నారు. ట్రంప్ ప్రచారంపై పెంటగాన్ మాజీ అధికారి మైఖేల్ రూబిన్ మాట్లాడుతూ.. ప్రతీ దానికి తానే కారణమని ట్రంప్ గొప్పలు చెప్పుకుంటూ ఉంటాడు. మీరు గనుక ట్రంప్‌ను అడిగితే.. ఒంటి చేత్తో వరల్డ్ కప్ సాధించానంటాడు. ఇంటర్‌నెట్‌ను కనిపెట్టింది తానేనంటాడు. క్యాన్సర్‌ను నయం చేసింది కూడా తానేనంటాడు. ఈ విషయంలో భారతీయులది కూడా అమెరికన్ల పరిస్థితే. భారతీయులు ట్రంప్ మాటల్ని పట్టించుకోవాల్సిన అవసరం లేదని అన్నారు. పాకిస్తాన్ మీద కూడా ఆయన దారుణమైన కామెంట్లు చేశారు. పాకిస్తాన్‌ను కుక్కతో పోల్చారు. ఇండియా దెబ్బకు పాకిస్తాన్ తోక ముడిచిన కుక్కలా పారిపోయిందని అన్నారు. భారత్, పాకిస్తాన్‌ల మధ్య యుద్ధం ఆగిపోవటంలో తన పాత్ర ఎంతో ఉందని డొనాల్డ్ ట్రంప్ ప్రతీ చోటా చెప్పుకుని తిరుగుతున్నారు. వీలు చిక్కినప్పుడల్లా యుద్ధం గురించే మాట్లాడు తున్నారని మండిపడ్డారు. మేము అణుయుద్ధాన్ని ఆపాము. లేదంటే అదో దారుణమైన అణు యుద్ధం అయి ఉండేది. యుద్ధం కారణంగా లక్షల మంది ప్రాణాలు పోయి ఉండేవి. ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, సెక్రటరీ ఆఫ్ స్టేట్ మార్కో రూబిన్‌లకు నా కృతజ్ఞతలు. గత శనివారం నా కారణంగానే రెండు దేశాల మధ్య యుద్ధం వెంటనే ఆగిపోయింది. రెండు దేశాల దగ్గర చాలా అణు బాంబులు ఉన్నాయి. రెండు దేశాలు యుద్ధం ఆపడానికి మేము ఎంతో సాయం చేశాము. వ్యాపార పరంగా కూడా సాయం చేస్తున్నాము. యుద్ధం ఆపితేనే వ్యాపారం చేస్తామని చెప్పాము. లేదంటే వ్యాపారం చేయము అని స్పష్టం చేశామని అన్నారు. అంతర్జాతీయంగా ఎవరి ప్రయోజనాలు వారికి ఉంటాయి. రష్యా-ఉక్రెయిన్ మధ్య యుద్ధం కారణంగా ఉభయ దేశాలూ నష్టపోయాయి. రష్యాకు తిరుగులేని సైనిక శక్తి, ఆయుధ సంపద ఉన్నప్పటికీ... పశ్చిమ దేశాలు, ముఖ్యంగా అమెరికా అండతో ఉక్రెయిన్ ఎదురొడ్డి నిలబడగలుగుతోంది. రష్యాతో తలపడటానికి అవసరమైన సహాయం కోసం ఉక్రెయిన్ తమ దేశంలోని సహజ వనరులు, ముఖ్యంగా ఖనిజ సంపదపై హక్కులను అమెరికాకు ధారాదత్తం చేయాల్సి వచ్చింది. మరోవైపు రష్యా కూడా పూర్వం ఉన్నట్టుగా ఆర్థికంగా పటిష్ఠంగా లేదు. ఈ క్రమంలో రూబిన్ వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ఇంటర్నెట్ కనిపెట్టడం నుంచి క్యాన్సర్‌ను నయం చేసేవరకు అన్నింటికీ క్రెడిట్ తీసుకోవడం ట్రంప్‌నకు అలవాటేనని రూబిన్ ఎద్దేవా చేశారు. డొనాల్డ్ ట్రంప్ ప్రతిదానికీ క్రెడిట్ పొందేందుకు ఇష్టపడతారు. మీరు ఆయన్ను అడిగితే.. ప్రపంచ కప్‌ను గెలుచుకున్నానని, ఇంటర్నెట్ కనుగొన్నానని, క్యాన్సర్‌ను నయం చేశానని చెప్పుకుంటారు. భారత్- పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం విషయంలో కూడా ఆయన అదే చేస్తున్నారు. ఈ విషయంలో అమెరికన్లలాగానే భారతీయులు ఆయన మాటలు పట్టించుకోవద్దు' అని రూబిన్ పేర్కొన్నారు.



# ముక్తిదాయకం.. పుష్కర స్నానం



కాళేశ్వర క్షేత్రానికి ఎంతో విశిష్టత ఉంది. ఇక్కడ గోదావరి, ప్రాణహిత నదులు సంగమిస్తాయి. ఈ సంగమ స్థానంలోనే అంతర్వాహినిగా సరస్వతీ నది కూడా కలుస్తుందని నమ్ముతారు. అందుకే కాళేశ్వరాన్ని దక్షిణ కాశిగా పిలుస్తారు. ఇక్కడ శివలింగంతోపాటు యమలింగం కూడా ఉండటం విశేషం. పూర్వం యముడు మనుషుల పాపాలను తొలగించి వారికి ముక్తిని ప్రసాదించమని శివుడిని ప్రార్థించగా, శివుడు ఆ కోరికను మన్నించాడు. అందువల్ల ఇక్కడ ఒకే పానవట్టంపై రెండు లింగాలు కొలువై ఉన్నాయి. కాళేశ్వరంలో సరస్వతీ నది గుప్త కామినిగా ప్రవహిస్తుందని చెబుతారు.ఆలయంలో శివలింగంపై పోసిన నీరు, ఆ లింగంలోని నాసికా రంధ్రాల ద్వారా భూమార్గంలో ప్రవహించి గోదావరి, ప్రాణహిత నదులతో కలుస్తుంది. అందుకే ఇక్కడ సరస్వతీ పుష్కరాలకు ఎంతో ప్రాధాన్యత ఉంది. కాళేశ్వరం పెద్దల పిండ ప్రదానానికి కూడా ముఖ్యమైన క్షేత్రం. కాశికి వెళ్లలేనివారు ఇక్కడ గోదావరి, ప్రాణహిత, సరస్వతి నదుల త్రివేణి సంగమంలో వైదిక కార్యక్రమాలు నిర్వహించుకుంటారు. ఇది కాశిలో జరిపినంత పుణ్యప్రదమని విశ్వసిస్తారు. అలాగే, కాళేశ్వరంలో దక్షిణ భారతదేశంలోనే అరుదైన సరస్వతీ దేవి ఆలయాలలో ఒకటి ఉంది. మరొక అరుదైన సూర్యదేవాలయం కూడా ఇక్కడే కొలువై ఉండటం విశేషం.'మేషే గంగా వృషే రేవా మిథునేతు సరస్వతీ కర్కటే యమునా ప్రోక్తా సింహే గోదావరీ స్మృతా కన్యాయాం కృష్ణవేణీచ కావేరీ ధటకే స్మృతా వృశ్చికే తామ్రపర్ణీచ చాపే పుష్కర వాహినీ మకరే తుంగభద్రాచ కుంభే సింధునదీ స్మృతా మీనే ప్రణీతా నదీచ గురోస్సంక్రమణే స్మృతా పుష్కరాఖ్యా మునీనాంహి బుధై స్మృతా' దేవగురువగు బృహస్పతి మేష రాశిలో ఉన్నప్పుడు గంగానదికి, వృషభరాశిలో ఉన్నప్పుడు నర్మదా నదికి, మిథున రాశిలో ఉన్నప్పుడు సరస్వతీ నదికి, కర్కాటక రాశిలో ఉన్నప్పుడు యమునా నదికి, సింహరాశిలో ఉన్నప్పుడు గోదావరి నదికి, కన్యారాశిలో ఉన్నప్పుడు కృష్ణా నదికి, తులారాశిలో ఉన్నప్పుడు కావేరి నదికి, వృశ్చిక రాశిలో ఉన్నప్పుడు తామ్రపర్ణి నదికి, ధనూరాశిలో ఉన్నప్పుడు బ్రహ్మపుత్రకు, మకర రాశిలో ఉన్నప్పుడు తుంగభద్రా నదికి, కుంభరాశిలో ఉన్నప్పుడు సింధునదికి, మీనరాశిలో ఉన్నప్పుడు ప్రణీతా నదికి పుష్కరాలు చెప్పబడ్డాయి.పుష్కరం అనగా జలస్వరూపం జలాది దేవతగా సమస్త తీర్థములకు నెలవై ఉండి తీర్థరాజు అను పేరుతో లోకకల్యాణ కారకు డైనట్లు శాస్త్రములు తెలుపుతున్నాయి. పూర్వం తుందిలుడనే బ్రహ్మణోత్తముడు మహేశ్వరుని గూర్చి తపస్సు చేసి తన అష్ట-మూర్తులతో ఒకటైన జల స్వరూపంతో పుష్కరుడు అను నామముతో పరమ శివుని ఐక్యమై ఉండుటకు వరం పొంది, పరమేశ్వరుని సాయుజ్యం పొంది ఉండగా బ్రహ్మదేవుడు సృష్టిని శక్తివంతం చేయుటకై శివుని వరంతో ఆ పుష్కరుని స్వీకరించి, తన కమండలంలో ఉంచుకొని సృష్టికార్యం నిర్వహిస్తుండగా, బృహస్పతి బ్రహ్మను వేడుకొని ఆ పుష్కరుని తన వెంట ఉండుటకై వరమును కోరెను. గ్రహాధి పత్యమును, ముక్కోటి దేవతలకు గురువుగాను ఆ పుష్కరుని సన్నిధిని శక్తివంతుడై యుండునట్లు కోరుకొనగా పుష్కరుడు బ్రహ్మను వీడి రాకకు సమ్మతించక పోగా బ్రహ్మదేవుడు, ఆ పుష్కరుని కోరికపై ముక్కోటి దేవతలతో మూడున్నర కోట్ల తీర్థములతో, మహర్షులతో, ఆ పుష్కరుని వెంట ఉండి, బృహస్పతి, ఆయా రాసులలో (మేషాది రాసులలో) చరించుచున్నప్పుడు ఆయా నదులకు (మేషేచ -గంగా) అను సూత్రానుసారం పుష్కరాలు నిర్వహిస్తారు.ప్రతి నదికి ప్రతి పన్నెండు సంవత్సరాలకు ఒకసారి పన్నెండు రోజులపాటు పుష్కరాలను ఎంతో వైభవంగా నిర్వహించే కార్యక్రమాలలో భాగంగా 2025 మే 15 నుంచి మే 26 వరకు సరస్వతీ నది పుష్కరాలు నిర్వహిస్తారు. సరస్వతీ నది హిందూ పురాణాలలో ఒక ముఖ్యమైన నది. ఋగ్వేదంలో ఈ నదిని ఎంతో పవిత్రంగా కీర్తించారు. తూర్పున యమునా నది, పశ్చిమాన శతద్రూ నది దీనికి సరిహద్దులుగా ఉండేవి. అయితే, మహాభారత కాలానికి ఈ నది ఎండిపోయినట్లు చెబుతారు. ప్రస్తుతం సరస్వతి పేరుతో ఒక చిన్న నది ఘగ్గర్ నదికి ఉపనదిగా ప్రవహిస్తోంది. చాలా మంది పండితులు ప్రాచీన సరస్వతీ నది ఇదే అయి ఉండవచ్చని భావిస్తున్నారు.సరస్వతీ దేవి తొలుత నదీ దేవతగా ఆరాధింపబడి, తరువాత విద్య, జ్ఞాన, సంగీత, కళల అధిదేవతగా గుర్తింపు పొందింది. హిందువులు సరస్వతీ నదిని అంతర్వాహినిగా భావిస్తారు. గంగా, యమునా నదుల సంగమమైన త్రివేణి సంగమంలో సరస్వతి కూడా కలిసి ఉంటుందని విశ్వసిస్తారు. సరస్వతీ పుష్కరాల సమయంలో భక్తులు అనేక పవిత్ర కార్యకలాపాలలో పాల్గొంటారు. ధ్యానం చేయడం, సాంప్రదాయ ఆచారాలను పాటించడం, ప్రార్థనలు చేయడం, పవిత్ర స్నానాలు ఆచరించడం వంటివి ముఖ్యమైనవి. ఈ సమయంలో నదిలో స్నానం చేయడం వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుందని, పాపాలు తొలగిపోతాయని భక్తుల నమ్ముతారు. 2025లో జరగబోయే సరస్వతీ పుష్కరాలు బద్రీనాథ్ సమీపంలోని మానా గ్రామంలో ముఖ్యంగా జరగనున్నాయి. ఇక్కడ ఈ నది అలకనంద నదిలో కలుస్తుంది.అలాగే ప్రయాగరాజ్‌లో కూడా త్రివేణీ సంగమంలో పుష్కరాలు నిర్వహిస్తారు. అయితే, తెలంగాణ రాష్ట్రంలో కూడా సరస్వతీ పుష్కరాలను నిర్వహించడానికి నిర్ణయం తీసుకున్నారు.

# యువ ఆటగాడికి స్థానం కోసమే కోహ్లీ రిటైర్మెంట్!!



దిగ్గజ క్రికెటర్లు విరాట కోహ్లీ, రోహిత్ శర్మ రిటైర్మెంట్ ప్రకటించడం వెనకాల చాలా పెద్ద కథే నడిచిందని తాజాగా కొన్ని కథనాలు వెలుగులోకి వచ్చాయి. ముఖ్యంగా కోహ్లీ సడెన్ రిటైర్మెంట్ నిర్ణయం వెనకాల ఒక ఉద్దేశం ఉందని తెలుస్తోంది. ఇప్పటికే సీనియర్ ఆటగాళ్లు రిటైర్మెంట్ కు దగ్గర పడిన స్థితిలో జట్టు సంధి కాలంలో కెప్టెన్ గా ఉండాలని కోహ్లీ భావించాడని తెలుస్తోంది. అందుకే ఇంగ్లాండ్ పర్యటనకు తనను సారథిగా ఎంపిక చేయాలని బోర్డును కోరాడని సమాచారం. అయితే ఈ నిర్ణయాన్ని బోర్డు సున్నితంగా తిరస్కరించి, యువ ఆటగాడికి ఇవ్వనున్నామని చెప్పడంతో కోహ్లీ ఇలా సడెన్ గా నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. మరోవైపు గత రెండేళ్లుగా ఫామ్ లేమితో సతమతమవుతున్న కోహ్లీ.. తన వీడ్కోలు సిరీస్ లాగా ఇంగ్లాండ్ సిరీస్ ఆడాలని, అందులో సత్తా చాటి, తనకెంతో ఇష్టమైన రెడ్ బాల్ ఫార్మాట్ కు టాటా చెప్పాలని భావించినట్లు తెలుస్తోంది. బీసీసీఐ నిర్ణయంతో అసంతృప్తికి లోనయిన కోహ్లీ.. తన రిటైర్మెంట్ నిర్ణయాన్ని మాజీ హెడ్ కోచ్ రవి శాస్త్రితో పంచుకున్నాడని సమాచారం. అలాగే తన డియరెస్ట్ ఫ్రెండ్ తోపాటు బోర్డులోనే చాలా ఇన్ఫ్లుయెన్స్ ఉన్న రాజీవ్ శుక్లాతో పలు దఫాలుగా ఈ నిర్ణయంపై చర్చలు జరిగాయని తెలుస్తోంది. అయితే ఇవేమీ కోహ్లీ రిటైర్మెంట్ నిర్ణయాన్ని మార్చలేక పోయాయని, దీంతో ఆటకు అల్విదా పలికినట్లు సమాచారం. అలాగే నిర్ణయాన్ని ప్రకటించేముందు చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ తోనూ రెండుసార్లు మాట్లాడాడని, ఐపీఎల్ కు స్మాల్ బ్రేక్ రావడంతో, ఈ చర్చలు ముమ్మరంగా సాగినట్లు తెలుస్తోంది.గతంలో ఉన్నట్లుగా డ్రెస్సింగ్ రూం.. ప్రస్తుతం లేదని, తనకు ఫ్రీ హ్యాండ్ ఇవ్వడం లేదని కోహ్లీ కంప్లయింట్ చేసినట్లు తెలుస్తోంది. అలాగే మునుపటిలాగా సీనియర్లకు ఉన్న సౌకర్యాలు కరువైనట్లు తెలుస్తోంది. ఈ విషయమై బోర్డు పెద్దలతో మాట్లాడినా పెద్దగా ఫలితం లేదని సమాచారం. నిజానికి ఇంగ్లాండ్ టూర్ తర్వాత రోహిత్, కోహ్లీ రెడ్ బాల్ కు దూరమవ్వాలని భావించారని, అయితే పరిస్థితులు అనుకూలించక అంతకుముందు గానే అల్విదా చెప్పినట్లు తెలుస్తోంది. ఇక రెడ్ బాల్ క్రికెట్లో పది వేల పరుగులను సాధించాలని కోహ్లీ ఎన్నోసార్లు చెప్పాడు. అయితే ఆ కోరిక తీరకుండానే తను టెస్టు ఫార్మాట్ కు వీడ్కోలు పలికాడు. అలాగే కేవలం వన్డేలకే పరిమితమవడంతో మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ నెలకొల్పిన అంతర్ జాతీయ వంద సెంచరీల రికార్డును కూడా విరాట్ కోహ్లీ చేరే అవకాశం లేదని తెలుస్తోంది.

# 2025 ఐపీఎల్ మే 17న రీస్టార్ట్

**• హంగు, ఆర్భాటాలు లేకుండా నిర్వహణ!!**



2025 ఐపీఎల్ మే 17న రీస్టార్ట్ కానుంది. ప్లే ఆఫ్స్ రేసులో ఉన్న జట్లన్నీ టోర్నీకి రెడీ అవుతున్నాయి. ఆటగాళ్లు ఇప్పటికే తమతమ ఫ్రాంచైజీ క్యాంపుల్లో చేరి ప్రాక్టీస్ మొదలు పెట్టేశారు. మే 17న ఆర్సీబీ-కేకేఆర్ మ్యాచ్?తో టోర్నీ పునః ప్రారంభం కానుంది. అయితే మిగిలిన మ్యాచ్‌లను ఎలాంటి హంగు, ఆర్భాటాలు లేకుండా నిర్వహించాలని ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది.ప్రస్తుత ఐపీఎల్‌లో ప్లేఆఫ్స్ సహా 17 మ్యాచ్‌లు మిగిలి ఉన్నాయి. అయితే ఈ మ్యాచ్‌లను సింపుల్‌గానే నిర్వహించాలని టీమ్ఇండియా మాజీ క్రికెటర్ సునీల్ గావస్కర్ బీసీసీకి సూచించాడు. గ్రౌండ్‌లో చీర్ లీడర్స్, డీజే హడావుడి లేకుండా టోర్నీ జరపాలని బోర్డుకు చెప్పాడట. గతనెల కశ్మీర్ పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో కుటుంబాల గౌరవార్థం ఈ నిర్ణయం తీసుకోవాలని కోరినట్లు తెలుస్తోంది. అయితే గావస్కర్ ప్రస్తావించిన అంశాన్ని బీసీసీఐ కూడా పరిగణలోకి తీసుకున్నట్లు సమాచారం. అందుకు సమ్మతిస్తూ హంగు, ఆర్భాటాలు లేకుండా మిగతా మ్యాచ్‌లు నిర్వహించేందుకు బీసీసీఐ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది.కాగా, పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో మే 08న టోర్నీ తాత్కాలిక వాయిదా పడింది. ధర్మశాల వేదికగా జరిగిన ఢిల్లీ- పంజాబ్ మ్యాచ్?ను మధ్యలోనే రద్దు చేశారు. దేశంలో నెలకొన్ని టెన్షన్ వాతావరణం దృష్ట్యా టోర్నీకి బ్రేక్ ఇచ్చారు. తాజాగా భారత్-పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదరడం వల్ల టోర్నమెంట్‌ను మళ్లీ ప్రారంభిస్తున్నారు. అయితే భద్రతా కారణాల వల్ల మిగిలిన టోర్నీని ఆరు వేదికల్లో నిర్వహిస్తున్నారు. మే 17న పునః ప్రారంభం కానున్న టోర్నీ జూన్ 03న ముగుస్తుంది. అయితే ఈసారి ఐపీఎల్‌లో ప్లేఆఫ్స్ రేసు రసవత్తరంగా సాగేలా కనిపిస్తోంది. టోర్నీలో ఇప్పటికే 57 మ్యాచ్‌లు పూర్తైనా అధికారికంగా ఏ జట్టు కూడా ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధించలేదు. మూడు (సన్?రైజర్స్, రాజస్థాన్, చెన్నై) జట్లకు మినహా ఏడు టీమ్స్‌కు ప్లేఆఫ్స్ అవకాశాలు సజీవంగా ఉన్నాయి.

# పీఎస్‌ఎల్‌ను వదిలి ఐపీఎల్‌లోకి!!

భారత్, పాకిస్థాన్ దేశాల మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తత ఇప్పుడు ముగిసింది. సరిహద్దులో ఇప్పుడు పూర్తి ప్రశాంత వాతావరణం నెలకొంది. అయితే ఈ ఉద్రిక్తతల కారణంగా ఐపీఎల్, పీఎస్-ఎల్(పాకిస్తాన్ సూపర్ లీగ్)లను మధ్యలో వాయిదా వేయాలని నిర్ణయం తీసుకోవలసి వచ్చింది. ఐపీఎల్ 2025 మిగిలిన మ్యాచ్‌లు మే 17 నుంచి ప్రారంభం కానున్నాయి. అదే సమయంలో పాకిస్థాన్ సూపర్ లీగ్ 10వ సీజన్ మ్యాచ్‌లు కూడా ఈ తేదీ నుంచి జరుగుతాయి.భద్రతా కారణాల దృష్ట్యా విదేశీ ఆటగాళ్లందరూ రెండు టోర్నమెంట్ల నుంచి నిష్క్రమించి తిరిగి ప్రారంభమవుతుందనే సమయంలో మళ్లీ తిరిగి వచ్చారు. ఇప్పుడు ఒక ఆస్ట్రేలియన్ ఆటగాడు పీఎస్ఎల్ 2025 టోర్నీలో పాల్గొనడానికి పాకిస్థాన్ చేరుకోవలసి ఉంది. కానీ ఈ ఆటగాడు పాకిస్థాన్ సూపర్ లీగ్‌ను విడిచిపెట్టి ఐపీఎల్‌లో ఆడటానికి వచ్చాడు. ఆ విధ్వంసక ఆసీస్ బ్యాటర్ పంజాబ్ కింగ్స్ జట్టులో చేరాడు.ఐపీఎల్ ఆడటానికి పాకిస్థాన్ సూపర్ లీగ్‌ను మధ్యలో వదిలిపెట్టిన ఆటగాడి పేరు మిచెల్ ఓవెన్. గ్లెన్ మ్యాక్స్‌వెల్ టోర్నమెంట్ నుంచి తప్పుకున్న తర్వాత అతని స్థానంలో పంజాబ్ కింగ్స్ మిచెల్ ఓవెన్‌ను జట్టులోకి తీసుకుంది. పీఎస్ఎల్‌లో బాబర్ ఆజం కెప్టెన్సీలో పెషావర్ జల్మీ తరఫున ఆడిన తర్వాత మిచెల్ ఓవెన్ పాకిస్థాన్ సూపర్ లీగ్‌లోనే మళ్లీ ఆడతాడని భావించారు. కానీ మిచెల్ ఓవెన్ పాకిస్థాన్ సూపర్ లీగ్‌ను విడిచిపెట్టి ఐపీఎల్‌లో పాల్గొనడానికి భారత్‌కు చేరుకున్నాడు. పంజాబ్ కింగ్స్ తమ ఎక్స్ ఖాతాలో మిచెల్ ఓవెన్ ఫోటోను కూడా షేర్ చేసింది.ఆసీస్ క్రికెటర్ మిచెల్ ఓవెన్ తన విస్ఫోటక బ్యాటింగ్‌కు ప్రసిద్ధి చెందాడు. చివరి మ్యాచ్‌లో హెూబర్ట్ హరికేన్స్ తరఫున ఆడుతూ మిచెల్ ఓవెన్ తన జట్టును ఛాంపియన్‌గా నిలబెట్టడంలో కీలక పాత్ర పోషించాడు. మిచెల్ ఓవెన్ 42 బంతుల్లో 108 పరుగులు చేసి అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. 257 స్ట్రైక్ రేట్‌తో ఆడిన ఈ ఆసీస్ క్రికెటర్ 11 అద్భుతమైన సిక్సర్లు కొట్టి చివరి మ్యాచ్‌ను పూర్తిగా ఏకపక్షంగా మార్చేశాడు. ఐపీఎల్‌లోని మిగిలిన మ్యాచ్‌లలో మిచెల్ ఓవెన్ నుంచి పంజాబ్ జట్టు అలాంటి ప్రదర్శనను ఆశిస్తుంది.

# 10వ తరగతి పరీక్షల్లో ఫెయిలైన వైభవ్ సూర్యవంశీ



యువ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీ మరోసారి వార్తల్లోకెక్కాడు. ఇటీవల వైభవ్ ఐపీఎల్?లో అరంగేట్రం చేసిన అత్యంత పిన్న వయస్కుడిగా రికార్డ్ కొట్టాడు. ఆ తర్వాత కెరీర్?లో ఆడిన మూడో మ్యాచ్?లోనే విధ్వంసం సృష్టించాడు. కేవలం 35 బంతుల్లోనే సెంచరీ బాది యావత్ క్రికెట్ ప్రపంచం దృష్టిని తన వైపునకు తిప్పుకున్నాడు. ఇవన్నీ అటుంచితే తాజాగా మరోసారి వైభవ్ సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతున్నాడు. అతడు 10వ తరగతి పరీక్షల్లో ఫెయిల్ అయ్యాడంటూ జోరుగా ప్రచారం సాగుతోంది. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్?ఈ) ఇటీవల 10వ తరగతి పరీక్ష ఫలితాలు వెల్లడించింది. ఈ ఫలితాల్లో ఐపీఎల్ సంచలనం వైభవ్ ఫెయిల్ అయ్యాడంటూ సోషల్ మీడియాలో ప్రచారం సాగుతోంది. అతడి పరీక్షా పేపర్లను బీసీసీఐ డీఆర్ఎస్ పద్ధతిలో రివ్యూ చేయాలంటూ ఓ పోస్ట్ వైరల్ అవుతోంది. అయితే అది 'సెటైరికల్ పోస్ట్'. వైభవ్ 10వ తరగతి ఫెయిల్ అయ్యాడంటూ వస్తున్న వార్తల్లో ఏ మాత్రం నిజం లేదు.'ఫెయిల్ అయ్యాడనే దాంట్లో నిజం లేదు. మరి పాసయ్యాడా?' అంటూ ఫ్యాన్స్ గూగుల్?లో తెగ వెతికేస్తున్నారు. అయితే వైభవ్ పాస్ కూడా కాలేదు. అదేంటి అనుకుంటున్నారా? అసలు పరీక్ష రాస్తేనే కదా, ఫెయిల్ లేదా పాస్ అయ్యేది. వాస్తవానికి వైభవ్ ఈ ఏడాది ఎలాంటి CBSE 10th పరీక్షలు రాయలేదు. సోషల్ మీడియా పోస్టులన్నీ ఉత్తుత్తి ప్రచారమే!అయితే వైభవ్ ఐపీఎల్? కారణంగానే పది పరీక్షలు రాయలేదని కథనాలు వస్తున్నాయి. అవి కూడా రూమర్సే. ఎందుకంటే వైభవ్ ప్రస్తుతం 9వ తరగతి చదువుతున్నట్లు తెలుస్తోంది. ఈ లెక్కన మనోడు 10వ పరీక్షలకు ఇంకో ఏడాది సమయం ఉందన్న మాట!ఇక వైభవ్ క్రికెట్ కెరీర్ విషయానికొస్తే, గతనెల లఖ్?నవూ మ్యాచ్?తో ఐపీఎల్ అరంగేట్రం చేశాడు. ఈ సీజన్?లో 5 మ్యాచ్?ల్లో వైభవ్ 155 పరుగులు చేశాడు. ఇందులో గుజరాత్?పై 35 బంతుల్లో సెంచరీ బాది, ఐపీఎల్?లో అత్యంత వేగంగా శతరం నమోదు చేసిన భారత బ్యాటర్?గా నిలిచాడు.

# విరాట్ కోహ్లీ దగ్గర శిక్షణ పొందా...

**• సంజయ్ బంగర్ కుమార్తె అనయ బంగర్**

భారత మాజీ క్రికెటర్ సంజయ్ బంగర్ కుమార్తె అనయ బంగర్ విరాట్ కోహ్లీతో తన సంభాషణను గుర్తు చేసుకుంది. తన తండ్రితో పాటు విరాట్ కోహ్లీ దగ్గర శిక్షణ పొందానని చెప్పింది. ఆ సమయంలో విరాట్ కోహ్లీ అనయ బంగర్‌కు బ్యాటింగ్ చిట్కాలు కూడా ఇచ్చినట్లు తాను చెప్పుకొచ్చింది. గతేడాది తన హార్మోన్ల మార్పుల కారణంగా వార్తల్లో నిలిచిన అనయ బంగర్.. విరాట్ కోహ్లీ నుంచి సలహాలు తీసుకున్నానని.. కోహ్లీ తన బలాలపై దృష్టి పెట్టమని ప్రోత్సహించినట్లు చెప్పింది.అనయ బంగర్ మాట్లాడుతూ.. “నేను విరాట్ కోహ్లీని చాలా సార్లు కలిశాను. నా తండ్రితో పాటు విరాట్ కోహ్లీ దగ్గర శిక్షణ కూడా పొందాడు. కోహ్లీ నాకు కొన్ని సలహాలు ఇచ్చాడు. నేను బ్యాటింగ్ చేయడం చూశాడు. కోహ్లీ బ్యాటింగ్ చేయడాన్ని దగ్గరగా చూసే అవకాశం నాకు లభించింది” అంటూ అనయ బంగర్ చెప్పుకొచ్చింది.మ్యాచ్ ఒత్తిడిని ఎలా ఎదుర్కొంటారని విరాట్ ను ఒకసారి అడిసారి అడిగినట్లు అనయ బంగర్ తెలిపింది. తమ సొంత బలాలను పూర్తిగా అర్థం చేసుకుని నమ్మే స్థాయి వరకు ప్రాక్టీస్ చేస్తామని విరాట్ కోహ్లీ తనకు చెప్పారని ఆమె వెల్లడించింది. మైదానంల తాము ఏం చేయగలరో వారికి తెలుసన్నారు. వారు దానిని నమ్ముతారని అనయ బంగర్ పేర్కొంది.బుధవారం 14న అనయ బంగర్ సోషల్ మీడియాలో ఒక వీడియోను పోస్ట్ చేసింది. అందులో ఆమె క్రికెట్ ఆడుతున్నట్లు కనిపించింది. ఆమె ఫ్రంట్ ఫుట్ ఆడుతున్నట్లు కనిపించింది. ఆ క్లిప్‌కు క్యాప్షన్ ఇస్తూ ఆమె ఇలా రాసుకొచ్చింది. “నా వద్ద నుంచి ఏదో పెద్ద విషయం రాబోతోందని మీకు తెలియజేస్తున్నాను” అంటూ రాసుకొ చ్చింది. టీమిండియా స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ విషయానికొస్తే.. కోహ్లీ మే 12న టెస్ట్ క్రికెట్ కు వీడ్కోలు పలికాడు. టెస్ట్ క్రికెట్ లో భారత్ తరఫున అత్యధిక పరుగులు సాధించిన ఆటగాళ్ల జాబి తాలో కోహ్లీ నాల్గవ స్థానంలో ఉన్నాడు. విరాట్ కోహ్లీ టెస్ట్ క్రికెట్‌లో 2011లో అరంగేట్రం చేశాడు.



# టెస్ట్ కెప్టెన్ రేసులోకి మరో పేరు!

**• రెండేళ్ల పాటు కెప్టెన్‌గా రవీంద్ర జడేజా?!**

రోహిత్ శర్మ రిటైర్మెంట్ తర్వాత టీమిండియా కొత్త టెస్ట్ కెప్టెన్ గురించి చాలా చర్చలు జరుగుతున్నాయి. భారత జట్టు కెప్టెన్సీ రేసులో శుభ్‌మన్ గిల్, జస్‌ప్రీత్ బుమ్రా పేర్లు ముందంజలో ఉన్నాయి. జస్‌ప్రీత్ బుమ్రా ఫిట్‌నెస్‌ను దృష్టిలో ఉంచుకుని, కెప్టెన్సీ బాధ్యతను శుభ్‌మన్ గిల్‌కు అప్పగించవచ్చని భావిస్తున్నారు. అయితే భారత మాజీ బౌలర్ రవిచంద్రన్ అశ్విన్ కెప్టెన్ కోసం ఒక ఆటగాడి పేరును సూచించాడు. అశ్విన్ సూచించిన ఆటగాడి పేరు కూడా ఎప్పుడూ చర్చలోకి రాలేదు. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ రిటైర్ అయిన తర్వాత జట్టులో అత్యంత అనుభవజ్ఞుజైన ఆటగాడిని జట్టుకు కెప్టెన్‌గా చేయాలని అశ్విన్ సూచించాడు.రవిచంద్రన్ అశ్విన్ తన యూట్యూబ్ ఛానెల్‌లో స్పోర్ట్స్ జర్నలిస్ట్ విమల్ కుమార్‌తో మాట్లాడుతూ .. టీమిండియా కొత్త టెస్ట్ కెప్టెన్ గురించి మాట్లాడారు. 25 ఏళ్ల శుభ్‌మన్ గిల్‌పై ఇప్పుడు అంత ఒత్తిడి తీసుకురావడం సరైనది కాదని అశ్విన్ అన్నాడు. రవీంద్ర జడేజాను రెండేళ్ల పాటు కెప్టెన్‌గా చేయవచ్చని ఆయన అన్నారు. “జట్టులో అత్యంత అనుభవజ్ఞుడైన ఆటగాడు రవీంద్ర జడేజా. మీరు కొత్త ఆటగాడికి శిక్షణ ఇవ్వాలనుకుంటే జడేజాను రెండేళ్లపాటు కెప్టెన్‌గా చేయండి. జడేజా రెండేళ్ల పాటు జట్టుకు నాయకత్వం వహించవచ్చు. శుభ్‌మన్ గిల్‌ను రవీంద్ర జడేజాకు డిప్యూటీ అంటే వైస్ కెప్టెన్‌గా చేయవచ్చు” అని అశ్విన్ అన్నాడు.భారత జట్టుకు కెప్టెన్ కావడం ప్రతి ఆటగాడి కల అని అశ్విన్ అన్నాడు. ఈ క్రమంలో రవీంద్ర జడేజా కూడా ఈ పాత్రను సంతోషంగా అంగీకరిస్తాడని చెప్పుకొచ్చాడు. జడేజాను కెప్టెన్ గా చేయమని తాను బలవంతం చేయడం లేదని.. కానీ జడేజాకు కెప్టెన్సీని అప్పగించడంలో ఎటువంటి హాని లేదని అశ్విన్ పేర్కొన్నాడు.రవీంద్ర జడేజా గతంలో ఐపీఎల్‌లో కెప్టెన్‌గా వ్యవహరించాడు. అయితే రవీంద్ర జడేజా కెప్టెన్సీలో చెన్నై సూపర్ కింగ్స్ ప్రదర్శన చాలా నిరాశపరిచింది. రవీంద్ర జడేజా సీజన్ మధ్యలో కెప్టెన్సీ నుంచి తప్పుకున్నాడు. రవీంద్ర జడేజాకు అనుభవానికి లోటు లేదు. రవీంద్ర జడేజా 2012లో టెస్ట్ క్రికెట్‌లో అరంగేట్రం చేశాడు.



# మ్యాన్ ఆఫ్ ద మ్యాన్షన్ హౌజ్






నందమూరి బాలకృష్ణ ఓ పాపులర్ సంస్థకు బ్రాండ్ అంబాసిడర్‌గా చేస్తున్నారు. అది కూడా ఆయనకు నచ్చిన బ్రాండ్ కావడం విశేషం. ఇంతకు ముందు ఆయన కొన్ని యాడ్స్ చేసినా... ఇది మాత్రం సమ్‌థింగ్ స్పెషల్ అని చెప్పాలి. బాలయ్య చేసిన కొత్త యాడ్ తాజాగా విడుదల చేశారు. బాలయ్యకు ఇష్టమైన డ్రింకింగ్ బ్రాండ్ ఏది? అనేది ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. అమెరికా వెళ్లినా సరే తన వెంట మ్యాన్షన్ హౌస్ తీసుకుని వెళతారని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆయన చిన్న అల్లుడు చెప్పిన విషయం తెలిసిందే. కానీ ఎప్పుడూ దాని గురించి బాలయ్య తన నోటి వెంట చెప్పింది లేదు. కానీ ఈసారి ఏకంగా ఈ బ్రాండ్ పై యాడ్ చేసి షాక్ ఇచ్చాడు. ఈ యాడ్‌లో బాలయ్య లుక్ అదిరిపోయింది. అయితే ఆహా తెలుగు ఓటీటీలో ఆయన హోస్ట్ గా చేసిన 'అన్‌స్టాపబుల్' టాక్ షోకి మ్యాన్షన్ హౌస్ అడ్వర్టయిజింగ్ ప్పార్టర్ అయింది. అప్పుడు మొదటిసారి బాలయ్య నోటి వెంట మ్యాన్షన్ హౌస్ అని వచ్చింది. ఇప్పుడు డైరెక్ట్ గా ఆ సంస్థకు ఆయన ప్రచారం చేస్తూ ఒక వాణిజ్య ప్రకటన చేయడం విషేశం ప్రజంట్ ఈ యాడ్ వైరల్ అవుతుంది.

# రాజ్‌తో సమంత..సతీమణి శ్యామాలి పోస్ట్ వైరల్

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత వ్యాక్తిగత జీవితం గురించి రోజుకో వార్త వైరల్ అవుతూనే ఉంటోంది. ఎంతో ప్రేమించిన అక్కినేని నాగచైతన్యతో విడాకుల తర్వాత సింగిల్‌గా ఉంటుంది సమంత. నాగచైతన్య రెండో పెళ్లి చేసుకోని హ్యాపి లైఫ్ లీడ్ చేస్తున్నప్పటికి సమంత కూడా రెండో పెళ్లి చేసుకుంటే బాగుంటుందని అభిమానులు, సినీ ప్రియులు కోరుకుంటు-న్నారు. అయితే కొద్ది రోజులుగా దర్శకుడు రాజ్ నిడిమోదుతో తరచు కనిపిస్తోంది సామ్.. ఎక్కడికి వెళ్లిన సమంత పక్కన రాజ్ ఉంటున్నాడు. దీంతో ఆమె వైవాహిక జీవితం పై నెట్టింట రూమర్స్ గట్టిగానే ప్రచారం అవుతున్నాయి. అయితే రాజ్ నిడిమోరుకు ఇప్పటికే పెళ్లి అయ్యింది. ఇలాంటి టైం లో తాజాగా సమంత తన ఇన్‌స్టాలో ఓ పోస్ట్ షేర్ చేసింది. ఇందులో రాజ్‌పై సమంత వాలినట్టుగా కనిపిస్తుంది. దీంతో ఈ వార్తలు మరింత పుంజుకున్నాయి. వారి బాండింగ్ రోజు రోజుకి బలపడుతుందిగా అని కొందరు కామెంట్ చేస్తున్నారు. ఈ ఫోటో సోషల్ మీడియాలో బాగా వైరల్ అయింది. అయితే తాజాగా రాజ్ సతీమణి శ్యామాలి తాజాగా ఎక్స్ వేదికగా ఒక సందేశాత్మక పోస్ట్ పెట్టింది.. 'నా గురించి ఆలోచించి, విని, మాట్లాడేవారితోపాటు నన్ను కలిసి, నాతో మాట్లాడి నా గురించి రాసే వారందరికి ప్రేమ, ఆశీస్సులు పంపుతున్నా' అనే పోస్ట్ ను ఆమె షేర్ చేశారు. ప్రస్తుతం ఇది నెట్టింట వైరల్ గా మారింది. కొంతకాలంగా ఎలాంటి పోస్ట్ షేర్ చేయని ఆమె ఉన్నట్టుండి ఇలాంటి సందేశం ఎందుకు షేర్ చేశారా? అని, ఆమె కచ్చితంగా సమంతని ఉద్దేశించే మాట్లాడుతూంది అని కామోంట్ లు విపడుతున్నాయి.



# సరిగమకు ది ప్యారడైజ్ ఆడియో హక్కులు




హిట్ 3తో సూపర్ హిట్ అందుకున్న నేచురల్ స్టార్ నాని కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం ది ప్యారడైజ్. దసరా సినిమాతో బ్లాక్ బస్టర్ అందుకున్న శ్రీకాంత్ ఓదెల ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. రాక్ స్టార్ అనిరుధ్ రవిచందర్ ఈ సినిమాకు సంగీతం అందిస్తుండటంతో పాటలు కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. ఇదిలావుంటే తాజాగా ఈ సినిమా ఆడియో హక్కులు భారీ ధరకు అమ్ముడుపోయినట్లు తెలుస్తుంది. ప్రముఖ మ్యూజిక్ కంపెనీ సరిగమ మ్యూజిక్ రూ. 18 కోట్లకు 'ది ప్యారడైజ్' ఆడియో రైట్స్‌ని దక్కించుకున్నట్లు సమాచారం. నాని కెరీర్‌లో ఒక సినిమా ఆడియో హక్కులకు ఇంత పెద్ద మొత్తం రావడం ఇదే మొదటిసారని సినీ వర్గాలు చెబుతున్నాయి. సినిమా విడుదల కాకముందే ఆడియో హక్కులు ఇంత పెద్ద మొత్తానికి అమ్ముడుపోవడం చిత్ర యూనిట్‌కు ఉత్సాహాన్ని ఇచ్చింది. ఇటీవల విడుదలైన టీజర్‌కు మంచి స్పందన లభించింది. ఈ చిత్రం తెలుగుతో పాటు- హిందీ, తమిళ, కన్నడ, మలయాళం, బెంగాలీ, ఇంగ్లీష్ మరియు స్పానిష్ భాషల్లో వచ్చే ఏడాది (2026) మార్చి 26న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ చిత్రం 1980ల కాలంలో హైదరాబాద్‌లో జరిగిన కొన్ని నిజమైన సంఘటనల ఆధారంగా తెరకెక్కుతున్నట్లు-సమాచారం. ఇది ఒక యాక్షన్ థ్రిల్లర్ కథాంశంతో రూపొందుతోంది.



# నా కథ సినిమాగా వస్తూ చూడాలని ఉంది: భజ్జీ

భారత క్రికెట్ చరిత్రలో అత్యంత గొప్ప బౌలర్లలో హర్భజన్ సింగ్ ఒకరు. తన స్పిన్ బౌలింగ్‌తో పాటు-, కీలక సమయాల్లో బ్యాటింగ్‌తోనూ ఎన్నో చిరస్మరణీయ విజయాలను అందించాడు. 'టర్బనేటర్'గా పిలువబడే హర్భజన్ క్రికెట్ కెరియర్ సినిమాటిక్ గా ఉంటుందని దాన్ని వెండితెరపై చూపిస్తే వర్కవుట్ అవుతుందని కొందరి ఒపీనియన్. రీసెంట్ గా ఓ ఇంటర్వ్యూలో భజ్జీ తన జీవిత కథ సినిమాగా వస్తే చూడాలని ఉందన్నాడు. అంతేకాకుండా తన రోల్ కు పాత్రకు న్యాయం చేయాలని భావిస్తున్న ఇద్దరు హీరోల పేర్లను వెల్లడించాడు. అందుల్లో ఒకరు విక్కీ కౌశల్ మరొకరు రణవీర్ సింగ్. తన పాత్రకు వీరైతేనే బాగుంటుందని చెబుతున్నాడు. ఇప్పటికే కపిల్ బయోపిక్ 83లో రణ్ వీర్ సింగ్ కపిల్ దేవ్ గా కనిపించాడు. బహుశా ఇదే రన్వీర్ తన పాత్ర కూడా చేస్తే బాగుంటుందని భజ్జీ భావిస్తున్నాడేమో. గతంలో రణవీర్ సింగ్ '83' చిత్రంలో కపిల్ దేవ్ పాత్రలో ఒదిగిపోయి, ఆ పాత్రను ఎంత అద్భుతంగా పోషించగలడో నిరూపించుకున్నాడు. ఆ చిత్రం బాక్సాఫీస్ వద్ద పెద్దగా విజయం సాధించకపోయినా, రణవీర్ నటనకు మాత్రం ప్రశంసలు దక్కాయి. మరోవైపు, విక్కీ కౌశల్ 'ఛావా' చిత్రంలో తన పాత్రలో సీరియస్ నెస్ ను చూపించాడు. బాక్సాఫీస్ వద్ద రూ. 600 కోట్లకు పైగా వసూలు చేసాడు. హర్భజన్ సింగ్ బయోపిక్‌లో తన పాత్రను ఎవరు పోషిస్తారో, ఆ చిత్రం ఎలా రూపుదిద్దుకుంటు-ందో చూడాలి. విక్కీ కౌశల్ తన ఇంటెన్సిటీతో కాని రణవీర్ సింగ్ తన ఎనర్జీతో భజ్జీ పాత్రలో మెప్పిస్తారో లేరో



# తమిళనాట పెద్ద హిట్ కొట్టిన టూరిస్ట్ ఫ్యామిలీ

ఈ మధ్య తమిళంలో పెద్ద సినిమాలకంటే చిన్న సినిమాలే తమ హవా చూపిస్తున్నాయి. ఈ ఏడాదిలో వచ్చిన లబ్బర్ పందు, మెయ్యాళగన్, కుదుంబస్తాన్, డ్రాగన్ చిత్రాలు సూపర్ హిట్‌లు అందుకున్నాయి. అయితే ఇదే కోవలో చిన్న సినిమాగా వచ్చి సూపర్ హిట్‌గా నిలిచింది టూరిస్ట్ ఫ్యామిలీ. తమిళ నటులు శశికుమార్, సిమ్రాన్ ప్రధాన పాత్రల్లో నటించగా.. యోగి బాబు, మిథున్ జై శంకర్, కమలేష్ జెగన్, ఎం.ఎస్. భాస్కర్, రమేష్ తిలక్, భగవతి పెరుమాళ్ తదితరులు ఈ సినిమాలో కీలక పాత్రల్లో నటించారు. అభిషన్ జీవింత్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం మే 1న ప్రేక్షకుల ముందుకు వచ్చి సూపర్ హిట్‌ను అందుకుంది. ముఖ్యంగా ఈ సినిమా చూసిన ప్రేక్షకులు చాలా బాగుందని ప్రశంసిస్తున్నారు. తలైవర్ రజనీకాంత్‌తో పాటు- నటు-డు శివకార్తికేయన్ కూడా ఈ సినిమా చూసి చిత్రబృందంని ప్రత్యేకంగా పిలిపించుకుని అభినందించారు. ఇదిలావుంటే ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతుంది. కేవలం రూ.5 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రం ఇప్పటివరకు ప్రపంచవ్యాప్తంగా రూ.55 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది. మరోవైపు తక్కువ బడ్జెట్‌తో రూపొందినప్పటికీ, 2025లో అత్యధిక వసూళ్లు సాధించిన తమిళ చిత్రాలలో ఇది ఒకటిగా నిలిచింది. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. శ్రీలంకలో నెలకొన్న ఆర్థిక సంక్షోభం కారణంగా ఒక తమిళ కుటు-ంబం తమ స్వస్థలాన్ని విడిచిపెట్టి భారతదేశానికి శరణార్థులు(స॥÷బిషగ॥)గా వస్తారు. అనంతరం వారు చెన్నైలో కొత్త జీవితాన్ని ప్రారంభించడానికి ప్రయత్నిస్తారు. కానీ వాళ్లు ఎవరు అనేది చెప్పకుండా దాచిపెట్టాల్సి వస్తుంది. అలా దాచిపెడుతూ ఉండగా అనుకోకుండా రామేశ్వరం దగ్గర ఒక బాంబ్ బ్లాస్ట్ సంఘటన జరుగుతుంది. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేయడం మొదలుపెడతారు. అయితే ఈ కేసుకి వీరికి సంబంధమేంటి.. శ్రీలంక నుంచి వచ్చిన ఈ ఫ్యామిలీకి ఎదురైన సమస్యలేమిటి అనేది ఈ సినిమా కథ.

# దాదాసాహెబ్ ఫాల్కే బయోపిక్‌లో ఎన్టీఆర్?



తాజా సమాచారం ప్రకారం సినీ పితామహుడిగా పరిశ్రమ కొనియాడే దాదాసాహెబ్ ఫాల్కే బయోపిక్ లో నటించేందుకు తారక్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు ప్రచారం నడుస్తుంది. ఈ ప్రాజెక్టు వెనుక రాజమౌళి, కార్తికేయ, వరుణ్ గుప్తా ప్రమేయం కూడా ఉందని టాక్. అంతే కాదు.. ఇప్పటికే స్క్రిప్ట్ కూడా సిద్ధం కాగా, అది విన్న జూనియర్ ఎన్టీఆర్ చాలా ఎగ్జైట్ అయి ఓకే చేశారట. అయితే భారతీయ చలన చిత్ర పరిశ్రమ ప్రస్థానాన్ని ఆవిష్కరిస్తూ రెండేళ్ల కిందటనే 'మేడ్ ఇన్ ఇండియా' అనే సినిమా అనౌన్స్ చేయగా, దర్శక ధీరుడు ఎస్ఎస్ రాజమౌళి సమర్పణలో నితిన్ కక్కర్ మూవీని తెరకెక్కించబోతున్నట్టు తెలిపారు. దీనికి సంబంధించిన నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు, త్వరలో వెల్లడిస్తామని అప్పుడు చెప్పగా, ఆ తర్వాత దాని నోరు విప్పింది లేదు. కాని ఇప్పుడు ఉన్నట్టుండి ఇందులో ఎన్టీఆర్ నటిస్తారని వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి.

**Editor, printer, published Owned by CHINTHALA RAMAKRISHNA Gummadidala (M&V) SANGAREDDY DIST TELANGANA State 502313 ph 8499902850/RNI NO:TELTEL/2022/81794**